


● నరసరావుపేట బస్టాండ్‌లో తాళం వేసిన మహిళల మరుగుదొడ్లు



మళ్లీ గేట్లెత్తారు

- సాగర్ నుంచి నీటి విడుదల
- 8 క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు వరద
- శ్రీశైలం నుంచి 65,842 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- సాగర్ జలాశయంలో పూర్తిస్థాయికి చేరిన నీరు

విజయపురిసౌత్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ గేట్లు మళ్లీ తెరుచుకున్నాయి. ఎగువ నుంచి వరద పోటెత్తడంతో జలాశయంలోని ఎనిమిది గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. గత ఆదివారం సాగర్ గేట్లను బంద్ చేసి నీటి విడుదలను ఆపేశారు. అయితే మళ్లీ ఆదివారం ఎనిమిది గేట్లు ఎత్తి సాగర్ నుంచి నీటి విడుదల చేశారు. గత నెల 29న డ్యాం అన్ని క్రస్ట్ గేట్లు తెరిచి ఆరు రోజులు దిగువకు నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. సాగర్ నుంచి ఆరు రోజులు 106 టీఎంసీలను విడుదల చేశారు. ప్రస్తుతం శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 65,842 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఆదివారం సాయంత్రం నీటి విడుదలను ప్రారంభించారు. సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం ఆదివారం నాటికి పూర్తి స్థాయిలో 590.00 అడుగులకి చేరింది. ఇది 312.04 టీ ఎంసీలకు సమానం. కుడి కాల్వ ద్వారా 6465 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 7518 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,070 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, 8 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 64,800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో 1,09,952 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పులిచింతలకు 64 వేల క్యూసెక్కులు రాక

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 42.81 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 64 వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు జలాశయానికి చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కుల నీరు,లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, గేట్ల ద్వారా 42,155 క్యూసెక్కులు, మొత్తం 59,155 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.



ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న ఉధృతి

తాడేపల్లి టౌన్: ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. పులిచింతల జలాశయంతో పాటు ప్రధాన వాగుల నుంచి 67 వేల 300 క్యూసెక్కుల వరద నీరు ఆదివారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్లు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా 60 గేట్లను 1 అడుగు మేర ఎత్తి దిగువకు 57 వేల 750 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాల్వలకు 10 వేల 042 క్యూసెక్కులు పశ్చిమ డెల్టా కాల్వలకు 6వేల 908 క్యూసెక్కులు, గుంటూరు ఛానల్‌కు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ తెలిపారు.

స్త్రీశక్తికి సంసిద్ధత ఏది?

ఐదు రోజుల్లో పథకం ప్రారంభం

- నరసరావుపేట బస్టాండ్‌లో సమస్యలపై నిర్లక్ష్యం
- ఇలాగైతే మహిళా ప్రయాణికులకు ఇక్కట్లు తప్పవు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీల్లో ఒకటైన స్త్రీశక్తి పథకం అమలుకు సమయం సమీపిస్తోంది. మరో ఐదు రోజుల్లో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులోకి రానున్నది. స్వాతంత్ర్య దినోత్సవం రోజున స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలో బస్టాండ్లలో మహిళా ప్రయాణికులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నాం.. కుర్చీలు.. రక్షిత నీరు.. పరిశుభ్రమైన మరుగుదొడ్లు, బస్సుల్లో మహిళలకు సౌకర్యవంతమైన సీటింగ్ ఇలా అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే జిల్లా కేంద్రమైన నరసరావుపేట బస్టాండ్‌లో ఆ పరిస్థితి మచ్చుకు కూడా కనిపించడం లేదు. తాగేందుకు పరిశుభ్రమైన నీరు లభించే పరిస్థితి లేదు. మొక్కుబడిగా కుళాయిలను నిర్వహిస్తున్నారు. మహిళల మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉన్నాయి. మరు గుదొడ్లలో నీరు కూడా ఉండటంలేదు. వీటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది.



పనిచేయని కుళాయిలు

ఆయా సమస్యలతో ఇప్పుడే మహిళా ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. అదే స్త్రీశక్తి అమల్లోకి వస్తే మహిళా ప్రయాణికులు పోటెత్తారు. ఆ స్థాయిలో బస్టాండ్‌లో కనీస వసతుల కల్పనపై ఆర్టీసీ అధికారుల్లో నిర్లక్ష్యం నెలకొందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల 90 కుర్చీలను ఏర్పాటు చేసినా మహిళల సంఖ్య పెరిగితే అవి సరిపోయే పరిస్థితి లేదు. జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే మిగిలిన ప్రాంతాల్లోని బస్టాండ్లలో సమస్యలు ఏవిధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా బస్టాండ్లలో వసతులు మెరుగుపరచాలని మహిళా ప్రయాణికులు కోరుతున్నారు.



ఇప్పుడే బస్సు ఎక్కేందుకు మహిళలు పాట్లు..



బస్సు కోసం ఎదురు చూపులు

వాటర్‌గ్రిడ్‌కు భూమి కావలెను

- స్థలం కేటాయింపులో మీనమేషాలు
- టెండర్ ఖరారైనా ప్రారంభం కాని పనులు
- అధికారుల నిర్లక్ష్యంతో జల్‌జీవన్ పనుల్లో జాప్యం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జల్‌జీవన్ పథకానికి నిధులు ఉన్నాయి.. టెండర్ ఖరారైంది.. అయినా జిల్లాలో వాటర్‌గ్రిడ్ నిర్మాణానికి భూ కేటాయింపుల్లో జాప్యంతో పనులు మొదలే కాలేదు. జల్‌జీవన్ పథకంలో విజయపురిసౌత్ హిల్ కాలనీ సమీపంలో నీటి శుద్ధి ప్లాంట్‌ను నిర్మించి జిల్లాలోని అన్ని ప్రాంతాలకు నీటిని సరఫరా చేయాలి. ప్లాంట్‌కు నీటిని సాగర్ జలాశయం బ్యాక్ వాటర్‌ను ఇన్‌టేక్ వెల్ ద్వారా సరఫరా చేయాలి. సాగర్ నుంచి నేరుగా నీటిని వినియోగించుకునే విధంగా పథకానికి 20 ఎకరాల స్థలం కేటాయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రెవెన్యూశాఖకు ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదిత స్థలంలో 10 ఎకరాలు రెవెన్యూ శాఖ పరిధిలో ఉండగా, మరో 10 ఎకరాలు బఫర్ కింద ఉందని అధికారులు తెలిపారు. స్థలం కేటాయింపులో రెవెన్యూ శాఖ మీనమేషాలు లెక్కపెడుతోంది. రూ.1,200 కోట్లతో పనులు చేపట్టేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ టెండరు ఖరారు చేసింది. ఈ పథకంలో నీటి శుద్ధి ప్లాంటు నిర్మాణం కీలకం. ప్లాంట్ నిర్మాణానికి కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ పూర్తి అయినా నేటి వరకు స్థలం అప్పగించలేదు. దీంతో పనులు చేపట్టే పరిస్థితి కానరావడం లేదు.



నీరుగారుతోన్న లక్ష్యం..

ఫ్లోరైడ్ అధికంగా ఉన్న జిల్లాల్లో పల్నాడు 12వ స్థానంలో ఉంది. నీటిలో 27.14 శాతం ఫ్లోరైడ్ ఉన్నట్లుగా నిర్ధారించారు. బోర్లు.. బావుల నీటి వినియోగాన్ని పూర్తిగా నిలిపివేసి కృష్ణా నదీ జలాలను ప్రతీ ఇంటికి సరఫరా చేయడమే లక్ష్యంగా వాటర్‌గ్రిడ్ నిర్మించాలి. పల్లెల్లో ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా 2019 ఆగస్టులో జల్‌జీవన్ పథకం అమల్లోకి వచ్చింది. ఆరేళ్లు గడిచినా రక్షిత జలాలు ఇంకా ప్రజల గొంతు తడపడంలేదంటే పథకంపై అధికారుల్లో నెలకొన్న నిర్లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. పథకాన్ని కేంద్రం 2028 వరకు పొడిగించినా పనుల్లో వేగం లేదు.

ట్రాక్టర్ల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే అరవిందబాబు



అన్నదాతల సంబరాలు

- రొంపిచర్లలో వంద ట్రాక్టర్లతో ప్రదర్శన
- వైసీపీ ట్రాప్‌లో ఎవరూ పడొద్దు: ఎంపీ లావు

రొంపిచర్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అన్నదాత సుఖీభవ నగదు జమ చేయడంపై రైతులు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో మండలంలోని రొంపిచర్లలో ఆదివారం రైతులు వంద ట్రాక్టర్లతో ప్రదర్శన నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీ చెరువు కట్ట సెంటర్ మీదగా మార్కెట్ యార్డు వద్ద జరిగింది. అనంతరం మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు ప్రసంగించారు. ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటుందన్నారు. వైసీపీ ట్రాప్‌లో ఎవరూ పడొద్దన్నారు. మూడు గ్యాస్ సిలెండర్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ అమలు చేశామని, శుక్రవారం నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సాగర్ నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాగునీటి సమస్యలపై రైతులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఎరువులపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని, కేంద్ర మంత్రులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తున్నామన్నారు. గతంలో కంటే జిల్లాకు 33 శాతం యూరియా అదనంగా కావాల్సి వచ్చిందని తెలిపారు. సాగు విస్తీర్ణం పెరగక పోయినా యూరియా అంత అవసరం రావడం ఏమిటని వ్యవసాయ శాఖ అధికారులను ప్రశ్నించారు. రైతులు పండించిన పంటలను నమోదు చేయించుకోవాలన్నారు. రొంపిచర్లలో కేంద్రీయ విశ్వవిద్యాలయం నిర్మాణం జరిగేలా చూడాలని ఎంపీని ఎమ్మెల్యే అరవింద బాబు కోరారు. రొంపిచర్లలో హైవేపై అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మొండితోక రాణి, ఏవో శివలలిత, నాయకులు కొల్లి బ్రహ్మయ్య, పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్, పులుకూరి జగ్గయ్య, మొండితోక రామారావు, చల్లా సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎంపీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అరవింద బాబు



అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ

- జూన్ 30కి రిజిస్ట్రేషన్ చేసిన వాటికే అవకాశం
- మాచర్లలో డైరెక్టర్ ఆఫ్ ప్లానింగ్ విద్యాలత

మాచర్ల రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ ప్లానింగ్ ఆర్‌జే విద్యాలత సూచించారు. ఆదివారం పట్టణంలోని కేసీపీ గెస్ట్‌హౌస్‌లో పురపాలక సంఘ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. పట్టణంలోని అనధికార లేఅవుట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. లేఅవుట్ల క్రమబద్ధీకరణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ ఏడాది జూన్ 30కి రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లు, లేఅవుట్లకు ప్రజలు ప్రభుత్వం కల్పించిన రాయితీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనిపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు, టౌన్ ప్లానింగ్ అధికారి నాగేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పనికిరాని ప్యాకేజీ!

- పండగల రద్దీ నియంత్రణకు రైల్వే రౌండ్ ది ట్రిప్ ప్యాకేజ్
- 22 రోజులకు తిరుగు ప్రయాణమైతేనే.. 20 శాతం రాయితీ
- దీని వల్ల ప్రయోజనం శూన్యమంటున్న ప్రయాణికులు

7



అక్రమ మైనింగ్‌పై సర్వేతో సరి

- మూడు రోజులు మమ.. చర్యలు నై
- 37 క్వారీలకు 8 క్వారీలకు మాత్రమే అనుమతి

యడ్లపాడు : ఎర్రకొండలో అనుమతులు లేకుండా క్వారీయింగ్



యడ్లపాడు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండలు కనుమరుగవుతున్నాయి.. పర్యావరణానికి హాని కలిగిస్తూ.. ప్రమాదకరంగా బ్లాస్టింగ్‌లతో పట్టపగ్గాలు లేకుండా క్వారీలు నిర్వహిస్తున్నా.. అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. మైనింగ్ కార్యకలాపాలతో భయాందోళనలు చెందిన ప్రజలు ఫిర్యాదులు చేసినా అధికారులు చర్యలు తీసుకోలేదు. ఏకంగా ఫిర్యాదు చేసిన వారిపై క్వారీల యజమానులు బెదిరిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పైగా అక్రమార్కులకు ఒత్తాసు పలికేలా అధికారులు చర్యలు ఉంటున్నాయన్న ఆందోళన ఆయా గ్రామాలకు చెందిన బాధితుల్లో నెలకొంది. అనుమతులు లేకుండా క్వారీయింగ్ చేస్తున్నారని అధికారులు గుర్తించినా చర్యలు తీసుకోవడంలో తాత్సారం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉప్పరపాలెం పరిధిలోని క్వారీలలో అక్రమ మెటల్ క్వారీయింగ్ జరుగుతోందంటూ గ్రామస్థుల ఫిర్యాదుతో కలెక్టర్ అరుణ్‌బాబు విచారణకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాలతో నరసరావుపేట ఆర్డీవో మధులత జూన్ 26న క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి మైనింగ్‌ను చూసి విస్తుపోయారు. 8 క్వారీలకే అనుమతులు ఉన్నాయని తెలుసుకుని మిగిలిన క్వారీల్లో మైనింగ్, రెవెన్యూ, పంచాయతీ, పోలీసు శాఖలు ఉమ్మడిగా సర్వే చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. మూడు రోజులు తొమ్మిది క్వారీల్లో సర్వే చేశారు. అయితే మైనింగ్ అధికారులు హాజరుకాకపోవడంతో అర్థాంతరంగా సర్వే నిలిచిపోయింది. ఎవరికి వారే కలెక్టర్‌కు నివేదికలు సమర్పించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అయితే అక్రమార్కులు తమ పలుకుబడిని ఉపయోగించి సర్వేను నిలుపుదల చేయించినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఉప్పరపాలెం, విశ్వనాధునికండ్రిక, మైదవోలు, కొండవీడు గ్రామాల పరిధిలోని కొండల్లో 37 క్వారీలు ఉండగా ఉప్పరపాలెంలో 4 క్వారీలకు, కండ్రిక పరిధిలో 4 క్వారీలకు మాత్రమే అనుమతులు ఉన్నట్లు తాజాగా నిర్వహించిన ఉమ్మడి సర్వేలో తేలింది. మిగిలిన వాటిలో ఎలాంటి అనుమతులు లేకుండానే క్వారీయింగ్ జరుగుతుందని అధికారులు తేల్చారు.

విజిలెన్స్ విచారణ జరిపించాలి

పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినప్పటి నుంచి బెదిరింపులు, ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నాను. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా వెనక్కి తగ్గకుండా గ్రామం కోసం పోరాటం చేస్తున్నాం. మైనింగ్, రెవెన్యూ అధికారుల విచారణ, సర్వేలతో న్యాయం జరగదు. మైనింగ్ ఆగడాలు ఆగాలంటే విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించాలి. అక్రమాలను అడ్డుకుంటే ప్రభుత్వానికి రూ.150 కోట్ల ఆదాయం వస్తుంది

- గుంజి శ్రీను, పీజీఆర్ఎస్ ఫిర్యాది

కలెక్టర్‌కు నివేదిక అందజేశాం

- నాగిని, ఏడీ మైనింగ్

యడ్లపాడు మండల పరిధిలో జరుగుతున్న అక్రమ మైనింగ్, సర్వేపై కలెక్టర్‌కు నివేదిక సమర్పించాం. సర్వేలో ఎదురవుతున్న ఇబ్బందులను తెలియచేసి, డ్రోన్ సర్వేకు అనుమతి కోరాం. కలెక్టర్ ఆదేశాలు రాగానే తిరిగి సర్వే చేపడతాం. అనుమతులు లేకుండా మైనింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

పార్టీలకతీతంగా మైనింగ్..

ఉప్పరపాలెం కొండ క్వారీలలో వైసీపీకి చెందిన వారిదే హవా కొనసాగుతోంది. ప్రస్తుతం ఒక్క క్వారీకి అనుమతి ఉండగా మరో 10కి పైగా క్వారీల్లో అక్రమంగా మైనింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. టీడీపీకి చెందిన వారు విశ్వనాధుని కండ్రిక అగ్రహార పరిధిలో అనుమతులు లేకుండా క్వారీయింగ్ చేస్తున్నారు. వంకాయలపాడులో రెండు దశాబ్దాల క్రితం అనుమతులు నిలిపేసిన క్వారీలో సైతం ప్రస్తుతం క్వారీయింగ్ చేస్తున్నారు. వారం క్రితం తహసీల్దార్ విజయశ్రీ కొండరాళ్లను క్రషర్‌కు అక్రమంగా తరలిస్తున్న లారీలను అడ్డుకోగా యజమాని రాజకీయ పలుకుబడితో విడిపించుకున్నట్లు సమాచారం. అయితే రెండు రోజుల అనంతరం మైనింగ్ అధికారులు దాడులు చేసి రెండు టిప్పర్లను సీజ్ చేసి రూ.16 వేలు పెనాల్టీ విధించారు. జరిమానా చెల్లించి తిరిగి క్వారీయింగ్ ప్రారంభించారు.



గంగమ్మతల్లికి.. పుష్పాలంకరణ

పిడుగురాళ్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాస ఆదివారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని గంగమ్మతల్లిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

క్లాట్ 2026



దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ జాతీయ న్యాయ విశ్వ విద్యాలయాల్లో అందించే అండర్ గ్రాడ్యుయేట్(యూజీ), పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) లా ప్రోగ్రామ్‌లో ప్రవేశాల కోసం 'క్లాట్' నోటిఫికేషన్ వెలువడింది. జాతీయ స్థాయి ఎంట్రెన్స్ ఆధారంగా 'కామన్ లా అడ్మిషన్ టెస్ట్'(క్లాట్)-2026 అడ్మిషన్స్ జరుపుతారు. ర్యాంకు సాధించిన విద్యార్థులకు ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎమ్ ప్రోగ్రామ్‌లో అడ్మిషన్ లభిస్తుంది.

కోర్సులు:

- అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్(ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ లా డిగ్రీ)
- పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్(ఏడాది ఎల్ఎల్ఎం డిగ్రీ)

అర్హతలు: అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసి ఉండాలి. పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు చేయాలనుకునే విద్యార్థులు కనీసం 50 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ పాసై ఉండాలి.
చివరి తేదీ: 2025 అక్టోబర్ 31
ఎంట్రెన్స్ తేదీ: 2025 డిసెంబర్ 7
వెబ్‌సైట్: consortiumofnlus.ac.in/

ప్రిపరేషన్:

క్లాట్‌కు సిద్ధం కావాలంటే మొదట సిలబస్‌ను అర్థం చేసుకోవాలి. తరువాత ఒక స్టడీ ప్లాన్‌ను తయారు చేసుకుని ముందుకు సాగాలి.. మాక్ టెస్ట్‌లు, గత సంవత్సరం ప్రశ్నపత్రాల ఆధారంగా ప్రిపరేషన్ స్థాయిలను అంచనా వేసుకోవాలి. నిలకడైన ప్రిపరేషన్, చదివిన విషయాలను బాగా ఆకళింపు చేసుకోగలగడం, టైమ్ మేనేజ్‌మెంట్ తదితరాలు విజయానికి దగ్గరి మెట్లు.

సిలబస్, ఎగ్జామ్ ప్యాటర్న్: ఇంగ్లిష్, కరెంట్ అఫైర్స్ జనరల్ నాలెడ్జ్, లీగల్ రీజనింగ్, లాజికల్ రీజనింగ్, క్వాంటిటేటివ్ టెక్నిక్స్ చాప్టర్లలను క్షుణ్ణంగా ప్రాక్టీస్ చేయాలి. ప్రిపరేషన్‌లో రోజు, వారం, నెలవారీ లక్ష్యాలను పెట్టుకోవాలి. క్రమం తప్పకుండా రివైజ్ చేసుకోవాలి.

సెక్షన్ వెయిటేజీ: ప్రతీ సెక్షన్‌లో చాప్టర్ల వెయిటేజీని అర్థం చేసుకోవాలి. దానికి అనుగుణంగా ప్రిపరేషన్ మొదలుపెట్టాలి. సబ్జెక్టుల వారీగా టైమ్‌టేబుల్ పెట్టుకోవాలి. బలహీనంగా ఉన్న వాటిని వదిలేయకుండా, దానిపై దృష్టిపెట్టాలి.

మార్కింగ్ స్కీమ్: క్లాట్‌లో నెగెటివ్ మార్కింగ్ ఉంది. ర్యాండమ్ గెస్ వర్క్ మానేసి, తెలిసిన సమాధానాలు గుర్తించడం మంచిది.

క్లాట్‌లో పాల్గొనే విద్యా సంస్థలు

- నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ(బెంగళూరు)
- నేషనల్ అకాడమి ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆఫ్ లా(నల్సార్-హైదరాబాద్)
- నేషనల్ లా యూనివర్సిటీ(జోధ్‌పూర్)
- నేషనల్ లా ఇన్‌స్టిట్యూట్ యూనివర్సిటీ(ఎన్ఎల్‌యూ-భోపాల్)
- ద వెస్ట్ బెంగాల్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జురిడికల్ సైన్సెస్(కోల్‌కతా)
- హిదయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ(రాయ్‌పూర్)
- గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ(గాంధీనగర్)
- డాక్టర్ రామ్ మనోహర్ లోహియా నేషనల్ లా యూనివ్సటీ (లఖనవ్)
- రాజీవ్ గాంధీ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లా(పటియాలా)
- చాణక్య నేషనల్ లా యూనివర్సిటీ, పట్నా
- నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్(కోచి)
- నేషనల్ లా యూనివర్సిటీ ఒడిషా(కటక్)
- నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ స్టడీ అండ్ రీసెర్చ్ ఇన్ లా(రాంచీ)
- నేషనల్ లా యూనివర్సిటీ అండ్ జుడీషియల్ అకాడమి(అస్సాం)
- దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ(విశాఖపట్నం)
- ద తమిళనాడు నేషనల్ లా యూనివర్సిటీ(తిరుచిరాపల్లి)
- మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ(ముంబాయి)
- మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ(నాగపూర్)
- మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ(ఔరంగాబాద్)
- హిమాచల్ ప్రదేశ్ నేషనల్ లా యూనివర్సిటీ(సిమ్లా)
- ధర్మశాస్త్ర నేషనల్ లా యూనివర్సిటీ(జబల్‌పూర్)
- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేషనల్ లా యూనివర్సిటీ(సోనేపత్-హర్యాన)
- నేషనల్ లా యూనివర్సిటీ త్రిపుర(అగర్తల)
- గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ(సిల్వెస్సా)

(ఇవి కాకుండా దేశ వ్యాప్తంగా ఉన్న పలు ప్రైవేటు కళాశాలలు క్లాట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తున్నాయి)

దిక్సూచి

ఎస్‌బీఐలో జూనియర్ అసిస్టెంట్లు

ఖాళీలు 6589

జూనియర్ అసోసియేట్స్(కస్టమర్ సపోర్ట్ అండ్ సేల్స్) ఉద్యోగాల భర్తీకి సంబంధించి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతోంది. దేశ వ్యాప్తంగా మొత్తం 6589 పోస్టులు ఉన్నాయి.
పోస్ట్‌పేరు: జూనియర్ అసోసియేట్స్(కస్టమర్ సపోర్ట్ అండ్ సేల్స్)
అర్హతలు: గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. ఫైనలియర్ చదువుతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే 2025 డిసెంబర్ 31లోపు గ్రాడ్యుయేషన్ పరీక్ష పాసైనట్లు సర్టిఫికెట్ చూపించాలి.
వయస్సు: 20 నుంచి 28 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 1997 ఏప్రిల్ 2నుంచి 2005 ఏప్రిల్ 1వ తేదీలోపు జన్మించి ఉండాలి. ఓబీసీలకు మూడు సంవత్సరాలు, ఎస్సీ/ఎస్టీలకు ఐదు సంవత్సరాలు, దివ్యాంగులకు కేటగిరీలను అనుసరించి 10 నుంచి 15 సంవత్సరాలు వయస్సులో సడలింపు ఉంటుంది. మాజీ సైనికులకు, ఇతరులకు నిబంధలను అనుసరించి సడలింపు ఉంటుంది.
భాషా ప్రావీణ్యం: దరఖాస్తు చేస్తున్న రాష్ట్రానికి సంబంధించిన భాష రాయడం, చదవడం వచ్చి ఉండాలి. పది, ఇంటర్‌లో ఆ భాష చదివినట్లు సర్టిఫికెట్ చూపించాల్సి ఉంటుంది.
చివరి తేదీ: 2025 ఆగస్టు 26
వెబ్‌సైట్: sbi.co.in/

State Bank of India

స్విమ్స్‌లో పీజీ కోర్సులు

శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) 2025-26 విద్యా సంవత్సరంలో పీజీ కోర్సుల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

కోర్సుల వివరాలు:

- ఎమ్మెస్సీ నర్సింగ్ (M.Sc. Nursing),
- యం.పి.టి, (M.P.T),
- ఎమ్మెస్సీ అలైడ్ హెల్త్ సైన్సెస్ (M.Sc. Allied Health Sciences)

డయాలసిస్ టెక్నాలజీ, ఎకో కార్డియోగ్రాఫీ, కార్డియాక్ కేత్ టెక్నాలజీ, పెర్ఫ్యూషన్ టెక్నాలజీ, ఎమ్మెస్సీ క్లినికల్ వైరాలజీ (M.Sc. Clinical Virology), ఎమ్మెస్సీ క్లినికల్ సైకాలజీ (M.Sc. Clinical Psychology) - స్పెషలైస్డ్ నర్సింగ్ (Post Basic Diploma in Nursing Programme) మొదలైన కోర్సుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.
వైబ్‌సైట్: https://svimstpt.ap.nic.in

జాబ్ కార్నర్


వాయు సేనలో అగ్నివీర్

భారత వాయుసేనలో 'అగ్నివీర్ వాయు' నియామకాల కోసం అవివాహితులైన పురుషుల నుంచి దరఖాస్తులను కోరుతున్నారు. అగ్నివీర్‌గా ఉన్న నాలుగు సంవత్సరాలు వివాహం చేసుకోరాదు. అభ్యర్థి శరీరం మీద ఎలాంటి టాటూలు ఉండకూడదు. ఇది క్రీడా కోటాకు సంబంధించిన నోటిఫికేషన్. రిక్రూట్‌మెంట్ ట్రయల్స్ సెప్టెంబర్ 8 నుంచి 10 వరకు జరుగుతాయి.



అర్హత: మేథ్స్, ఫిజిక్స్‌లతో ఇంటర్ చదివి, కనీసం 50 శాతం మార్కులతో పాసై ఉండాలి. లేదా ఇంజనీరింగ్‌లో డిప్లొమా ఉండాలి. నాన్ సైన్స్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు(పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు). వీటితోపాటు నిర్ణీత శారీరక ప్రమాణలు, స్పోర్ట్స్ అచీవ్‌మెంట్స్ ఉండాలి.
వయస్సు: 2025 జనవరి 1 నుంచి 2008 జూలై1 తేదీ మధ్యలో జన్మించి ఉండాలి.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
ఎంపిక: డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, స్పోర్ట్స్ నైపుణ్య పరీక్షలు(క్రీడా విభాగాల ప్రకారం), మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాలు చూస్తారు.
ట్రయల్స్ వేదిక: తేజస్ క్యాంపస్, ఎయిర్ ఫోర్స్ స్టేషన్, న్యూఢిల్లీ, లోక్ కల్యాణ్ మార్గ్, న్యూఢిల్లీ
చివరి తేదీ: 2025 ఆగస్టు 20
వెబ్‌సైట్: agnipathvayu.cdac.in/AV/

ఇంజనీరింగ్ డిగ్రీతో ఇండియన్ ఆర్మీలోకి



ఇండియన్ ఆర్మీలో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల కోసం షార్ట్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ వెలువడింది. ఈ టెక్నికల్ పోస్టులకు రాత పరీక్ష లేదు. బీటెక్ మార్కులను వడపోసి ఇంటర్వ్యూకు పిలుస్తారు. రెండు దశల్లో, ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ ఇంటర్వ్యూలో రాణించాలి. ఆ తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించి, ఉద్యోగంలోకి తీసుకుంటారు. చదువుకున్న బ్రాంచీలో ఉద్యోగం చేయవచ్చు.

ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో 49 వారాలు శిక్షణ ఉంటుంది. ఇది 2026 ఏప్రిల్‌లో మొదలు అవుతుంది. శిక్షణ సమయంలో 56,100 స్టయిఫండ్ ఇస్తారు. ఆ తర్వాత 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్' పేరుతో మద్రాస్ యూనివర్సిటీ డిగ్రీ ఇస్తుంది. శిక్షణ అనంతరం లెవెల్ 10లో లెఫ్టినెంట్ హోదాలో ఆర్మీలోకి తీసుకుంటారు. అన్నీ కలుపుకుని తొలి నెల నుంచి దాదాపుగా 1.5 లక్షల జీతం వస్తుంది. ఎస్ఎస్సీలో పదేళ్ల సర్వీస్ ఉంటుంది. ఆ తర్వాత ఇందులో కొంత మందిని పర్మనెంట్ కమిషన్‌లోకి తీసుకుంటారు. మిగిలిన వారికి మరో నాలుగేళ్ల సర్వీస్ పొడగింపు ఇస్తారు. వీరు రెండేళ్ల అనుభవంతో కెప్టెన్, ఆరేళ్ల అనుభవంతో మేజర్, 13 ఏళ్ల అనుభవంతో లెఫ్టినెంట్ కల్నల్ హోదాకు చేరుకోవచ్చు.

ఖాళీల వివరాలు: మొత్తం 379 ఖాళీలు ఉన్నాయి. ఇందులో పురుషులకు 350, మహిళలకు 29 ఉన్నాయి.(వీటిలో రెండు సైనిక వితంతువులకు కేటాయించారు). పురుషుల పోస్టుల్లో విభాగాల వారీగా చూస్తే సివిల్ 75, కంప్యూటర్ 60, ఎలక్ట్రికల్ 33, ఎలక్ట్రానిక్స్ 64, మెకానికల్ 101, మిగతా బ్రాంచీల్లో 17 ఉన్నాయి, మహిళల పోస్టుల్లో సివిల్ 7, కంప్యూటర్ సైన్స్ 4, ఎలక్ట్రికల్ 3, ఎలక్ట్రానిక్స్6, మెకానికల్ 9 ఉన్నాయి.

విద్యార్హత: సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉండాలి. ఫైనలియర్ చదివే విద్యార్థులు కూడా అర్హులే. వారు నిర్ణీత సమయంలో డిగ్రీని సమర్పించాల్సి ఉంటుంది. కంప్యూటర్ సైన్స్ ఖాళీలకు బీటెక్ ఐటీ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు.



వయస్సు: 2026 ఏప్రిల్ 1వ తేదీ నాటికి 20 నుంచి 27 ఏళ్ల లోపు ఉండాలి. అంటే 1999 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2006 మార్చి 31 తేదీలోపు జన్మించి ఉండాలి. సైన్య వితంతువుల వయస్సు 35 సంవత్సరాలు దాటి ఉండకూడదు.
చివరి తేదీ: 2025 ఆగస్టు 22 తేదీ
వెబ్‌సైట్: www.joinindianarmy.nic.in

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ఆమరణ నిరాహార దీక్ష చేస్తాం

ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్



ఫెడరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

ఫిల్మ్ ఫెడరేషన్ నాయకులతో ఫిల్మ్ ఛాంబర్ జరిపిన చర్చలు విఫలమవడంతో సినీ కార్మికులు ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 24 క్రాఫ్ట్ విభాగాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సెవెన్ ఎకర్స్ వద్ద ఉన్న యూనియన్ కార్యాలయాల నుంచి వెంకటగిరిలోని ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫీసు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫెడరేషన్ కార్యాలయం వద్ద ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ మీడియాతో మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. 'కొందరికి పెంచి మిగతా వారికి పెంచకపోవడం అన్యాయం. మొదటి ఏడాది 20 శాతం, మరో ఏడాది 10 శాతం పెంచాలని కోరుతున్నాం. దానికి ఛాంబర్ ఒప్పుకోవడం లేదు. వాళ్ల కండీషన్లకు మేము తలొగ్గేది లేదు. షెడ్యూల్‌లో ఉన్న షూటింగ్స్‌కి రెండు రోజుల గడువు ఇస్తున్నాం. ఆ తరవాత షూటింగులన్నీ బంద్ చేస్తాం. మెగాస్టార్ చిరంజీవి టచ్‌లోనే ఉన్నారు. కానీ, మేము ఫిల్మ్ ఛాంబర్ వద్దనే తేల్చుకుంటాం. రెండు రోజుల్లో లేబర్ కమిషనర్‌ను కలుస్తాం. అప్పటికీ మా సమస్య పరిష్కారం కాకపోతే ఛాంబర్‌ను ముట్టడించి నిరాహార దీక్ష చేస్తాం. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ కోర్టును ఆశ్రయించారు. కోర్టు తీర్పు వచ్చే వరకు ఆయన చిత్రాల షూటింగ్‌లకు హాజరుకాబోము. విశ్వప్రసాద్‌కు చెందిన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సినీ కార్మికులకు రూ.90 లక్షల బకాయి ఉంది. ఛాంబర్ నిర్ణయం మేరకే తుది కార్యాచరణ ఉంటుంది' అని వల్లభనేని అనిల్ అన్నారు.

-ఆంధ్రజ్యోతి(యూసుఫ్‌గూడ)

నన్నెవరూ ఆపలేరు

ఎన్టీఆర్



'నందమూరి తారక రామారావు ఆశిస్సులు నా మీద ఉన్నంత కాలం నన్నెవరూ ఆపలేరు. ఎవరేన్ని మాట్లాడుకున్నా.. బొమ్మ అదిరిపోయింది. పండగ చేసుకోండి. సినిమాలో ట్విస్ట్‌లు చాలా ఉన్నాయి. చూసిన తర్వాత మీరు వాటిని బయటపెట్టకండి. ఇది హిందీ చిత్రమే కాదు తెలుగు సినిమా కూడా' అని అన్నారు జూనియర్ ఎన్టీఆర్. హృతిక్ రోషన్‌తో కలసి ఆయన నటించిన తాజా యాక్షన్ థ్రిల్లర్ 'వార్-2'. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ నిర్మించింది. కియారా అద్వాని కథానాయిక. సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఎన్టీఆర్ మాట్లాడుతూ 'ఇద్దరు స్టార్స్‌ని పెట్టుకుని అయాన్ ముఖర్జీ మూవీని ఈ స్థాయిలో తీయడం నిజంగా అద్భుతం. 25 ఏళ్ల క్రితం 'కహోనా ప్యార్ హై' చిత్రంలో హృతిక్ డ్యాన్స్ చూసి మైమరచిపోయాను. ఇండియాలో ఉన్న గొప్ప నటుల్లో హృతిక్ ఒకరు. ఆయనతో కలసి డ్యాన్స్ చేయడం నా అదృష్టం. ఇది ఎన్టీఆర్ చేస్తున్న హిందీ మూవీ కాదు, హృతిక్ చేస్తున్న తెలుగు సినిమా కూడా. రామోజీరావు గారు తన బేనర్‌లో నన్ను పరిచయం చేశారు. అప్పుడు అలా మొదలైన నా జర్నీ 25 ఏళ్లు సాగింది' అని అన్నారు. హృతిక్ రోషన్ మాట్లాడుతూ 'తెలుగు ప్రేక్షకుల ప్రేమను మర్చిపోలేను. నేను నటించిన ప్రతి సినిమాను ఆదరించారు. 'వార్-2' కూడా మీకు వినోదాన్ని పంచుతుంది. మేము చాలా కష్టపడి పనిచేశాం. ఈ ప్రయాణంలో తారక్ నుంచి స్ఫూర్తిని పొందాను' అని అన్నారు. చిత్ర దర్శకుడు అయాన్ ముఖర్జీ మాట్లాడుతూ 'ఇప్పటిదాకా మీరు ట్రైలర్, సాంగ్స్, ఫైట్ సీక్వెన్సెస్ చూశారు. వీటన్నింటినీ మించిన ఆశ్చర్యం ఈనెల 14న చూడబోతున్నారు. ఆ రోజు మీ స్పందన కోసం ఎదురు చూస్తున్నాను' అని అన్నారు. నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ 'ఈ సినిమా మీకు నచ్చకపోతే ఇంకోసారి మైక్ పట్టుకొని సినిమా చూడండి అని అనను. ఎందుకంటే అంత అద్భుతంగా ఉంటుందీ చిత్రం' అని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

ఒకేసారి ఆరు సినిమాలు ఖరారు



ప్రముఖ నిర్మాణ సంస్థ 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఒకేసారి ఆరు కొత్త సినిమాలకు స్క్రిప్ట్‌లు సిద్ధం చేసింది. ఈ సందర్భంగా నిర్మాతలు విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'వచ్చే రెండేళ్లలో విభిన్న కథలతో ఈ ఆరు సినిమాలను తెరకెక్కించి వరుసగా విడుదల చేస్తాం. ప్రతి సినిమా మంచి థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది. మంచి క్వాలిటీ కంటెంట్‌తో రూపొందిస్తున్నాం. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో ప్రకటిస్తాం' అని చెప్పారు.

కథనం భావోద్వేగభరితం



గగన్‌బాబు, కశికా కపూర్ జంటగా ఏకే జంపన్న దర్శకత్వం వహిస్తున్న చిత్రం షూటింగ్ ఆదివారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు షాట్‌కు నిర్మాత సాహు గారపాటి క్లాప్ ఇచ్చారు. వివేక్ కూచిభొట్ల కెమెరా స్విచ్చాన్ చేశారు. వీరశంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. ఇదొక ఎమోషనల్ సస్పెన్స్ థ్రిల్లర్ అని జంపన్న చెప్పారు. మా గోల్డెన్ ప్రొడక్షన్స్‌లో వస్తున్న తొలి చిత్రమిది. అద్భుతమైన కథతో తెరకెక్కిస్తున్నాం. ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది అని నిర్మాత తోట లక్ష్మీ కోటేశ్వరరావు అన్నారు.

మరొక్కసారి అలరించే ప్రేమకథ



నరేశ్ అగస్త్య, సంజనా సారథి జంటగా నితిన్ లింగుట్ల దర్శకత్వం వహించిన చిత్రం 'మరొక్కసారి'. బి. చంద్రకాంత్ రెడ్డి నిర్మిస్తున్నారు. నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. 'ఓ జంట జీవితంలో జరిగిన అనూహ్య సంఘటనల నేపథ్యంలో ఆహ్లాదకరకమైన ప్రేమకథతో 'మరొక్కసారి' తెరకెక్కించాం. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అని మేకర్స్ తెలిపారు.

FARNAZ

హామీల అమలు ఎప్పుడు

● ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్



మాట్లాడుతున్న సాయి శ్రీనివాస్

గుంటూరు (విద్య) ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఎప్పుడూ అమలు చేస్తారో చెప్పాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ ప్రశ్నించారు. ఆదివారం గుంటూరులో జరిగిన కృష్ణా, గుంటూరు జిల్లాల కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు డి. పెద్దబాబు అధ్యక్షత వహించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సకాలంలో డీఏలు ఇస్తామని, మెరుగైన వేతన సవరణ చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని శ్రీనివాస్ గుర్తుచేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ బోధనేతర పనులు మితిమీరి ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో తెలుగు మాధ్యమం తప్పనిసరిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎస్. రామచంద్రయ్య, షేక్.మహబుబ్ సుభాని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ప్రసాదరావు, పల్నాడు, బాపట్ల, కృష్ణా జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

కేజేఎస్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులుగా మల్లెల, కన్నెగంటి


మల్లెల హరేంద్రనాథ్ చౌదరి


కన్నెగంటి బుచ్చయ్య చౌదరి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కమ్మజన సేవా సమితి (కేజేఎస్ఎస్) అధ్యక్ష, కార్యదర్శులుగా మల్లెల హరేంద్రనాథ్ చౌదరి, కన్నెగంటి బుచ్చయ్య చౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా చుక్కపల్లి రమేష్, మాదల రత్నగిరి బాబు, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. నూతన పాలక వర్గం మూడేళ్ల పాటు కొనసాగుతుంది. ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్న సామినేని కోటేశ్వర రావు ఇకపై సమితి గౌరవ అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. మల్లెల హరేంద్రనాథ్ చౌదరి పాలకవర్గ కమిటీలో తొలుత సభ్యుడిగా, ఆ తర్వాత ఉపాధ్యక్షుడిగా బాధ్య తలు నిర్వహించారు. కమ్మ బాలికల వసతి గృహంలో ఉన్న డిజిటల్ గ్రంథాలయం, జిమ్, రీడింగ్ రూమ్ ఏర్పాటుకు ఆయన కృషి చేశారు. వసతి గృహం, సమితి సేవల గురించి ప్రవాసాంధ్రులకు అవగాహన కల్పించి, విరాళాల సేకరణకు కృషి చేశారు. కన్నెగంటి బుచ్చయ్య చౌదరి పాలక కమిటీలో తొలుత గౌరవ సలహాదారుగా పనిచేశారు. ఆ తర్వాత ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. సమితి అభివృద్ధి, ఉపకార వేతనాల పంపిణీతో పాటు పలు సేవల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమితి సేవలను మరింత విస్తృత పరుస్తామన్నారు. నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయంలో అత్యుత్తమ కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసి, నూతన కోర్సులకు శిక్షణ అందజేస్తామని చెప్పారు. నూతన భవనాన్ని త్వరలోనే పూర్తి చేసి ప్రవేశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. రెండు వేల మందికి వసతి కల్పించాలని లక్ష్యంలో రూ.50 కోట్ల నిధులతో నిర్మిస్తున్న భవన సముదాయానికి దాతలు మరింతగా సహకరించాలని కోరారు. నూతనంగా ఎన్నికైన కోశాధికారి కాపూరి రవిచంద్ర, సంయుక్త కార్యదర్శులు రాయపాటి గోపాలకృష్ణ, ఘంటా పున్నారావు, సభ్యులు వడ్లమూడి శివరామకృష్ణయ్య, డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాదు, కరణం పట్టాభి సీతారామయ్య, మర్రిపూడి సీతారామయ్య, ప్రత్యేక ఆహ్వానితులు గోరంట్ల పున్నయ్య చౌదరి, పెద్ది సాంబశివరావును పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

ఏడాది చివరికి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు పూర్తి

కేంద్రమంత్రి పెమ్మసాని


రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తెనాలి ప్రాంత ప్రయాణికుల అభిరుచికి అనుగుణంగా రైల్వే స్టేషన్‌ను రూ.27 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి తెనాలి రైల్వే స్టేషన్‌లో అమృత్ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. డివిజనల్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు స్టేషన్‌లో జరుగుతున్న పనులను కేంద్ర మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఫేజ్-1 కింద రైల్వే స్టేషన్‌ల ఆధునీకరణ చేపట్టిందని, ఎయిర్ పోర్టులతో సమానంగా తీర్చిదిద్దుతోందని చెప్పారు. రైల్వే స్టేషన్ పనులు 60 శాతం పూర్తి అయ్యాయని, డిసెంబరు ఆఖరికి అన్ని పనులు పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తామన్నారు. స్టేషన్ బయట స్థలం పార్కింగ్, వాహనాల రాకపోకలకు చాలకపోవడాన్ని గుర్తించామని, దానిని విస్తరించే ఆలోచన చేయాలని అధికారులను కోరామన్నారు. స్టేషన్ వద్ద గంజాయి వినియోగం నిరోధానికి డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని రైల్వే పోలీసులకు సూచించారు. పలువురు పార్టీ నాయకులు, రైల్వే శాఖాధికారులు పాల్గొన్నారు.

మాటలకు అందని విషాదం

● మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే యరపతినేని పరామర్శ


యర్రం శ్రీనివాసరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, జడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య తదితరులు

మాచవరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఊహించని విధంగా జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబంలో ఐదుగురు మరణించడం చాలా బాధాకరమని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు విచారం వ్యక్తం చేశారు. శనివారం ప్రకాశం జిల్లా ఉలవపాడు గ్రామ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మండలంలోని కొత్తగణేషునిపాడు గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలో ఐదుగురు చనిపోయిన విషం విదితమే. ఆదివారం ఎమ్మెల్యే శ్రీనివాసరావు మృతుల కుటుంబాలను పరామర్శించారు. జరిగిన సంఘటనను బంధువులను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వం, పార్టీ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

మృతులకు నివాళి

పిడుగురాళ్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉలవపాడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని పెదఅగ్రహారం గ్రామానికి చెందిన యర్రం శ్రీనివాసరావు మృతదేహానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నివాళులర్పించారు. అలాగే అదేవిధంగా కామేపల్లిలో ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన ఆలూరి వెంకటేశ్వర్లు చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జడ్పీటీసీ వెంకట కోటయ్య, మండల పార్టీ కన్వీనర్ గండికోట వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

ప్రభుత్వ డ్రైవర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా రమేష్‌బాబు


రమేష్‌బాబును సత్కరిస్తున్న సంఘ నాయకులు

గుంటూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహన డ్రైవర్ల కేంద్ర సంఘం అధ్యక్షుడిగా పి.రమేష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరు నగరంలోని ఏపీ ఎన్జీవో భవన్‌లో రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 13 ఉమ్మడి జిల్లాల నుంచి ప్రభుత్వ డ్రైవర్లు 150 మంది హాజరయ్యారు. ఇప్పటి వరకు అధ్యక్షుడిగా ఉన్న నంసాని శ్రీనివాసరావుపై అనేక అవినీతి ఆరోపణలు రావడంతో ఈ సమావేశం నిర్వహించారు. ఆయా అంశాలపై చర్చించారు. శ్రీనివాసరావుపై అవిశ్వాసం ప్రకటించి.. అధ్యక్ష పదవి నుండి తొలగించినట్లు నిర్ణయించారు. నూతన అధ్యక్షుడిగా రమేష్ బాబుని నియమిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం రమేష్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. నంసాని శ్రీనివాసరావు ఓడీ సదుపాయాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా రమేష్‌బాబుని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షరీఫ్, నగర అధ్యక్షుడు సూరి, వై.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పనికిరాని ప్యాకేజీ!

● పండగల రద్దీ నియంత్రణకు రైల్వే రౌండ్ ది ట్రిప్ ప్యాకేజీ ● 22 రోజుల తర్వాత తిరుగు ప్రయాణమైతేనే 20శాతం రాయితీ
● ప్రయోజనం శూన్యమంటున్న ప్రయాణికులు

గుంటూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పండగలకు ప్రజలు సొంతూళ్లకు, బంధువులు ఇళ్లకు వెళ్లి వస్తుంటారు. ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు చేస్తుంటారు. దసరా, క్రిస్మస్, సంక్రాంతి పండగలు ఏవైనా.. పది రోజులకు మించి సెలవులు ఉండవు. దీనిని ఏమాత్రం పరిగణనలోకి తీసుకోని రైల్వే శాఖ పండగ రద్దీ నియంత్రణకు రౌండ్ ది ట్రిప్ ప్యాకేజీని ప్రకటించింది. ఈ పథకం కింద ఒక ప్రాంతానికి వెళ్లి, వచ్చేందుకు 20 శాతం రాయితీని కల్పిస్తున్నట్లు పేర్కొంది. అయితే ఇక్కడ ఒక మెలిక పెట్టింది. ఒక ప్రాంతానికి వెళ్లి అక్కడి నుంచే.. 22 రోజుల తర్వాత తిరుగు ప్రయాణమైతేనే ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపింది. ఆ నిబంధన ప్రయాణికులను నిరాశపరిచింది.

ప్యాకేజీ ఇలా..

ఏటా పండగల రోజుల్లో రైళ్లలో రద్దీ అధికంగా ఉంటుంది. దాంతో టిక్కెట్‌లు బుకింగ్ చేసుకోవడానికి ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతుంటారు. ఎక్కువగా తత్కాల్‌పై ఆశలు పెట్టుకొంటుంటారు. ఈ నేపథ్యంలో రైల్వే శాఖ ఈ నెల 14వ తేదీ నుంచి రౌండ్ ది ట్రిప్ ప్యాకేజీని అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ స్కీమ్ కింద అక్టోబరు 13 నుంచి 26వ తేదీ మధ్యన ప్రయాణానికి అడ్వాన్స్ రిజర్వేషన్ చేసుకోవాలి. తిరుగు ప్రయాణం నవంబరు 17 నుంచి డిసెంబరు 1 మధ్యన ఉండాలి. అప్పుడే ఈ స్కీమ్ వర్తిస్తుంది. ఇందుకోసం ఆన్‌లైన్/పీఆర్ఎస్ కౌంటర్లలో కనెక్టింగ్ జర్నీ ఫీచర్‌ని ఉపయోగించాలి. రెండు నెలలు ముందస్తు రిజర్వేషన్ కాల నియమ నిబంధనలు ఈ తిరుగు ప్రయాణ బుకింగ్‌కు వర్తిం చవు. ఈ స్కీమ్ కింద టిక్కెట్ బుకింగ్ చేసుకొనే ప్రయాణికులు ప్ర యాణం చేసే స్టేషన్, దిగే స్టేషన్ ఒక్కటే అయి ఉండాలి. ప్రయాణం చేసే తరగతులు కూడా ఒక్కటే ఉండాలి. ఈ పథకం కింద బుకింగ్ చేసుకొన్న టిక్కెట్లను రద్దు చేసుకొంటే నగదు వాపసు ఇవ్వరు. రెగ్యులర్ రైళ్లతో పాటు ప్రత్యేక, టీవోడీ రైళ్లలో కూడా ఈ స్కీం అమలు అవుతుంది. ఈ టిక్కెట్లలో ఎటువంటి మార్పులను అ నుమతించరు. రాయితీ ఛార్జీపై తిరుగు ప్రయాణ బుకింగ్ సమయం లో డిస్కౌంట్, రైలు ప్రయాణ కూపన్లు, ఓచర్ ఆధారిత బుకింగ్, పా స్‌లు, పీటీవోలు కూడా అనుమతించడం కుదరదు. చార్టింగ్ సమ యంలో ఏదైనా తలెత్తితే అదనపు చార్జీలు వసూలు చేయరు. 20 శా తం రాయితీ వరకు బాగానే ఉన్నా తిరుగు ప్రయాణ వ్యవధి 22 రో జుల తర్వాత నిర్ణయించడమే బాగాలేదని ప్రయాణికులు చెబుతున్నారు.

గిరిజనులను మోసగిస్తున్న పవన్ : సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మంగళగిరి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదివాసీలను మోసగిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న భూములను అదానీకి అప్పగించేందుకే పవన్ గిరిజన బాట పట్టారని విమ ర్శించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం రాత్రి కేవీపీఎస్ జిల్లా ఆరో మహాసభ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు - సామాజిక న్యాయం అనే అంశమై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో కొత్తగా ఏవో కార్యక్రమాలను చేస్తున్నట్లు పనవ్ నటిస్తూ.. గిరిజన ప్రజలను పవన్ మోసగిస్తున్నారన్నారు. కార్పొరేట్ కంపెనీలకు ఉచితంగా భూములను స్వాధీనం చేయడానికే ఈ కుట్రంతా జరుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ-4 ఓ చెత్త పథకమన్నారు. పేదలను ప్రభుత్వాలు ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఏవైనా ఉపాధి పథకాలను ప్రవేశపెట్టాలే తప్ప వారిని ఎవరో దయాదాక్షిణ్యాలపై ఆధారపడేలా చేయడం సమంజసం కాదన్నారు. జె. నవీన్‌ప్రకాశ్ అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనందకుమార్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, ఎన్.కిషోర్ మాట్లాడారు. అనంతరం కేవీపీఎస్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వై.కమలాకర్‌రావు, కార్యదర్శిగా జె.నవీన్‌ప్రకాష్, ఉపాధ్యక్షులుగా బి.వెంకటేశ్వర్లు, జి.లూథర్‌పాల్, సహాయ కార్యదర్శులుగా ఎస్.దుర్గారావు, కె.రమేష్ ప్రభృతులను ఎన్నుకున్నారు.

పర్యాటక శాఖ అభివృద్ధే ధ్యేయం

● జీఎం చందన నాంచారయ్య

విజయపురిసౌత్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పర్యాటక శాఖ అభివృద్ధే తమ ధ్యేయమని పర్యాటక శాఖ జీఎం చందన నాంచారయ్య పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్థానిక లాంచీ స్టేషన్‌ను సందర్శించారు. మూడు నెలలుగా నిలిచిపోయిన ఆగస్త్య లాంచీకి మరమ్మతులు నిర్వహిస్తున్నామని, రెండు రోజుల్లో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. అనంతరం హరిత రిసార్ట్స్‌ను సందర్శించారు. జీఎం వెంట విజయవాడ అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్, లాంచీ యూనిట్ మేనేజర్ వినయతుల్లా, హరిత రిసార్ట్స్ మేనేజర్ మస్తాన్‌రావు, షలుసు వీరారెడ్డి ఉన్నారు.

శ్రీలంక దేశస్థుల పర్యటన..

నాగార్జున కొండను 45 మంది శ్రీలంక దేశస్థుల బృందం సందర్శించింది. వీరు లాంచీలో నాగార్జున కొండకు చేరుకొని మ్యూజియంలోని బుద్ధుని పాలరాతి విగ్రహం, ప్రతిమలు, రాతి పనిముట్లు, అనుపులోని అశ్వమేధ యజ్ఞ శాల, శ్రీచైత్యంను తిలకించారు. సెలవుదినం కావడంతో నాగార్జున కొండకు పర్యాటకుల తాకిడి అధికంగా ఉంది. కుటుంబంతో సరదాగా గడిపారు. లాంచీ స్టేషన్‌కు రూ.71 వేల ఆదాయం సమకూరినట్లు యూనిట్ అధికారులు తెలిపారు.



లాంచీ స్టేషన్‌ను పరిశీలిస్తున్న జీఎం చందన నాంచారయ్య


లాంచీ స్టేషన్ వద్ద శ్రీలంక దేశస్థులు

విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రం

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

రెంటచింతల,ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం అరాచక పాలన వల్ల రాష్ట్రం అస్తవ్యస్తమైందని.. ఎంతో మంది పారిశ్రామిక వేత్తలు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లారని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు విమర్శించారు. రెంటచింతలలో టీడీపీ సీనియర్ నేత యేనిగండ్ల రమేష్ బాబు ఇంట వివాహ వేడుకకు హాజరైన ఆయన.. అనంతరం విలేకరులతో మాట్లాడారు. నాశనమైన ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడానికి సీఎం చంద్రబాబు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగానే పీ4 అమలు చేసి 10 వేల నిరుపేద కుటుంబాలను గుర్తించామని, వారందరూ ఆర్థికంగా నిలదొక్కుకునేలా కృషి చేస్తున్నారన్నారు. విధ్వంసం నుంచి వికాసం వైపు పయనిస్తున్నామన్నారు. పల్నాడులో ఎక్కడా అరాచకాలు లేకపోవడం వల్ల పల్లెలు ప్రశాంతంగా ఉన్నాయని యరపతినేని తెలిపారు. బుగ్గవాగు ఆధునీకరణకు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. టీడీపీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అబ్బిరెడ్డి, శ్రీనివాసరావు, సుమంత్‌రెడ్డి, రామకృష్ణ, ఆదూరి శివ, సోము, శౌరెడ్డి, రాయపరెడ్డి, మాజీ ఎంపీపీ నాగమ్మనర్సిరెడ్డి, నాశం పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

1.0879 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల,ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు 6 రేడియల్ క్రస్టు గేట్లను రెండు మీటర్ల మేర ఎత్తి 59,664, విద్యుదుత్పత్తి అనంతరం టేల్ రేస్ చానల్ ద్వారా 8,589, మొత్తంగా 68,253 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఈఈలు సుబ్రహ్మణ్యం, సుబ్బారావు తెలిపారు. సాగర్ నుంచి 61,864 క్యూసెక్కుల నీరు వస్తోందని, శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 1.0876 ఎంయూల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుందని, ఇది 7.080 టీఎంసీలకు సమానమన్నారు.

జాతీయస్థాయి వాటర్ పోలోకు బాపట్ల క్రీడాకారులు


ఖాజామొహిద్దీన్, డోనాల్డ్ వెంకట్‌గౌడ్

బాపట్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి వాటర్ పోలో పోటీలకు బాపట్ల క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు గుజరాత్‌లోని నారన్పూర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరగనున్న 78వ సీనియర్ నేషనల్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో బాపట్లకు చెందిన ఉప్పాల డోనాల్డ్ వెంకట్‌గౌడ్, చందోలుకు చెందిన షేక్.ఖాజామొహిద్దీన్ పాల్గొనున్నారు. రాష్ట్రం నుంచి ఎంపికైన వీరికి పలువురు అభినందనలు తెలిపారు. జిల్లా నుంచి వీరు ఇప్పటికే అనేక జాతీయస్థాయి ఈత పోటీల్లో బహుమతులు గెలుచుకున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

రేపల్లె, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పులిగడ్డ వారధి నుంచి రేపల్లె వస్తున్న లారీ అతివేగంగా పుప్పాల శ్రీనివాస్(55) అనే వ్యక్తిని ఢీకొనడంతో.. అక్కడికక్కడే మృతిచెందాడని పట్టణ సీఐ మల్లికార్జున్‌రావు ఆదివారం తెలిపారు. నిజాంపట్నం మండలం ప్రజ్ఞం గ్రామానికి చెందిన మృతుడు ప్రస్తుతం పట్టణంలోని త్రిబులెక్స్‌స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్నాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కాల్వలో ఈత కొడుతూ యువకుడి మృతి

ముప్పాళ్ళ ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సరదాగా ఈతకు దిగిన యువకుడు మృతి చెందిన ఘటన ముప్పాళ్ళలోని పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్‌లో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. చిలకా సాగర్ (25), వడ్డవల్లి నరేంద్ర బంధువులు. సాగర్ చిలకూరిపేటలో టాటా ఏస్ వాహనం తోలుతూ జీవనం సాగిస్తున్నాడు. నరేంద్ర భార్యది మాదల కాగా అక్కడే నివాసం ఉంటున్నాడు. నరేంద్రకు మార్టూరులో పొగాకు పని డబ్బులు రావాల్సి ఉండగా సాగర్‌ను తీసుకుని ద్విచక్ర వాహనంపై వేల్పూరుకు బయలు దేరారు. మార్గమధ్యంలో ఎండ వేడిమికి ముప్పాళ్ళ కాలువ (పీబీసీ) వద్ద ఆగారు. మంచినీరు తెచ్చేందుకు నరేంద్ర పక్కనే ఉన్న కొట్టు వద్దకు వెళ్లగా.. సాగర్ బ్రిడ్జికి అవతల వైపు దిగాడు. ఈత కొడుతున్న సాగర్ నీటి ఉధృతికి బ్రిడ్జి కిందగా డ్రాపులో పడిపోయాడు. గమనించిన నరేంద్ర కేకలు వేయడంతో స్థానికులు డ్రాపు నీటి నుంచి బయటకు తీయగా అప్పటికే సాగర్ మృతి చెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లి కోటమ్మ బోరునవ విలపించింది. ఎస్ఐ సోమేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కోటమ్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాంగ్రెస్ నిర్వాకంతోనే షెడ్యూల్ కులాలకు అన్యాయం

● ప్రొఫెసర్ జోసఫ్ మోసిగంటి

పొన్నూరుటౌన్, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): 75 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన షెడ్యూల్ క్యాస్ట్ ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌తో షెడ్యూల్ కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతూనే ఉందని జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ జోసఫ్ మోసిగంటి ఆదివారం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ ఉత్తర్వుల ద్వారా ఎస్సీలకు సంపూర్ణ మత స్వేచ్ఛ తీసివేశారని ఆరోపించారు. 1950లో సిక్కు మతంలోకి , 1990లో బౌద్ధ మతంలో మారిన వారికి ఎస్సీ రిజర్వేషన్ పోకుండా రాజ్యాంగంలో సవరణ చేశారన్నారు. కానీ, క్రైస్తవం, ఇస్లాంలోకి మారిన షెడ్యూల్ కులాల వారికి 75 సంవత్సరాలుగా అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. 2007లో జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ ఎస్సీలకు మత ప్రమేయం లేకుండా రిజర్వేషన్ కల్పించాలని సూచించిందని గుర్తుచేశారు. మతం మారిన వారికి రిజర్వేషన్లు దూరం చేయడం ప్రాథమిక హక్కు, సమానత్వానికి వ్యతిరేకమవుతుందని పేర్కొందని తెలిపారు. నరేంద్ర మోదీ సారథ్యంలోని కూటమి మాత్రమే షెడ్యూల్ కులాల వారికి సంపూర్ణ మత స్వేచ్ఛనిచ్చి.. న్యాయం చేయగల సామర్థ్యం ఉందని అభిప్రాయపడ్డారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	111, 119, 130
చికెన్ విత్ స్కిన్(కిలో)	210.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	220.00

రేపు రైతు రథం ర్యాలీ

పిడుగురాళ్ల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలుచేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం కోట్లాది మంది రైతులకు ప్రయోజనం చేకూరడంతో మంగళవారం పిడుగురాళ్లలో రైతులతో కలిసి ఎమ్మెల్యే యరపతినేని భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. ఆర్అండ్‌బీ బంగ్లా నుండి ట్రాక్టర్లతో మార్కెట్‌యార్డు వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ శ్రేణులు తెలిపారు. సుమారు 25 ట్రాక్టర్లు, 2వేల మంది రైతులు, పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.

యరపతినేనిని కలిసిన శిరీష


ఎమ్మెల్యే యరపతినేనితో బండ్ల శిరీష

పిడుగురాళ్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల మండలం జానపాడు గ్రామానికి చెందిన బండ్ల శిరీష ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును ఆదివారం కలిశారు. చిన్నతనం నుండి అమెరికాలో వుంటున్న బండ్ల శిరీష 2023లో రెండు రోజుల పాటు అంతరిక్షంలో గడిపారు. సొంత ఊరులో కొన్నాళ్లు గడిపేందుకు వచ్చిన శిరీష చేసిన సహసాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే యరపతినేని, శిరీషను సత్కరించి అభినందనలు తెలిపారు. పల్నాడు ప్రాంతానికి మంచి పేరు తీసుకురావడానికి శిరీష చేసిన సాహసాన్ని ఎమ్మెల్యే కొనియాడారు.

వైభవంగా పౌర్ణమి గరుడ వాహన సేవ

సత్తెనపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద గల వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం స్వామివారికి గరుడ వాహన సేవ జరిగింది. శ్రీవారికి ఇష్టమైన గరుడ వాహనంపై పుర వీధుల్లో భక్తులకు స్వామి వారు దర్శనమిచ్చారు. ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

సత్తెనపల్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలల విజయవాడ జోన్ పరిధిలోని క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. స్థానిక శిశు మందిర్ పాఠశాలలో మూడు రోజులుగా జరిగిన వివిధ ఆటల పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న సెంట్రల్ జీఎస్టీ ఇన్‌స్పెక్టర్ వనమ హర్ష సాయి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడల ద్వారా కూడా విద్యార్థికి ఈ గుర్తింపు లభిస్తుందన్నారు. జోన్ స్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులు మిగిలిన పోటీల్లో కూడా తమ ప్రతిభను నిరూపించుకోవాలన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌తో పాటు తదితర పోటీల్లో విజేత జట్లకు, విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ కొల్లిపర కాశీ విశ్వనాథం, పాఠశాల కార్యదర్శి చలువాది చిన సత్యనారాయణ, హెచ్ఎం ధనలక్ష్మి, పెద్దన్న, రాము, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాగాణి సాగుకు ప్రోత్సాహం

క్రోసూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): క్రోసూరు మండలంలో మాగాణి పంట సాగుకు తమ వంతు ప్రోత్సాహం అందిస్తామని మండల వ్యవసాయ అధికారి వీ వేణుగోపాల్ ఆదివారం తెలియజేశారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో 5204 రకం బీపీటీ విత్తనాలను వంద శాతం సబ్సిడీపై రైతులకు అందించామన్నారు. మండలంలోని ఆవులవారిపాలెం, పెరికపాడు, దొడ్లేరు, అనంతవరం గ్రామాల్లో ఇప్పటికే వరినాట్లు పడ్డాయని, చెరువు నీరు విడుదల చేయటంతో ఎర్రబాలెం, క్రోసూరు, అందుకూరు గ్రామాల పరిధిలో కూడా కొద్ది రోజుల్లోనే నాట్లు పడతాయని ఆయన తెలిపారు. రైతులందరూ తాము వేసిన పంటను రైతు సేవా కేంద్రాల ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. పంటల బీమా ప్రీమియం గడువు ఆగస్టు 15వ తేదీ వరకు మాత్రమే ఉందన్నారు.

ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి

అచ్చంపేట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తల గ్రామ సమీపంలో ఆటో బోల్తా పడిన ప్రమాదంలో బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కావలి వెంకటేశ్వర్లు(66) ఆటో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం ఉదయం నాగిరెడ్డిపాలెం గ్రామం నుంచి కస్తల గ్రామానికి ఫంక్షన్ నిమిత్తం ఆటోలో వెళ్ళి తిరిగి వచ్చే క్రమంలో ఈ సంఘటన జరిగింది. దీనిలో ప్రయాణిస్తున్న మరొక వ్యక్తికి తీవ్రగాయాలు కావటంతో 108లో సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వరి సాలు నాటు పద్ధతితో అధిక లాభాలు

కారంపూడి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వరిలో సాలు నాటు లేదా బెంగాల్ నాటు పద్ధతి ద్వారా అధిక లాభాలు సాధించవచ్చని ఏవో పోట్ల నరసింహారావు తెలిపారు. ఆదివారం మండలంలోని కాకానివారిపాలెం గ్రామంలోని వరి పొలాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాగాణి సాగు చేస్తున్న రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


అత్యాధునిక సిటీ స్కాన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

శ్రీదత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో హై రిజల్యూషన్ సీటీ స్కాన్ ప్రారంభం

నరసరావుపేట లీగల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని వైద్య రంగంలో మరో అధునాతన అధ్యాయాన్ని జోడిస్తూ, నరసరావుపేటలోని శ్రీదత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అత్యాధునిక హైరెజల్యూషన్ సీటీ స్కాన్ సౌకర్యాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని, ఈ అధునాతన సీటీ స్కాన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ పల్నాటి జిల్లా వైద్య రంగంలో ఈ సరికొత్త సాంకేతికత ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. శ్రీదత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఈ అత్యాధునిక సాంకేతికతను ప్రవేశపెట్టడం ద్వారా స్థానికులకు అత్యుత్తమ వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చిందని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. కార్యక్రమంలో శ్రీదత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణకాంత్, టీడీపీ నాయకులు కపిలవాయి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పగలు అందం.. రాత్రి అంధకారం!


167 ఏడీ జాతీయ రహదారి


కూడలి వద్ద వెలగని విద్యుత్ దీపాలు

రెంటచింతల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రెంటచింతల మండలంలో 167 ఏడీ జాతీయ రహదారి 4.1 కిలోమీటర్లు విస్తరించి ఉంది. పగటి పూట ఈ రహదారి(మిట్టగుడిపాడు అడ్డరోడ్డు మినహా) సుందరంగా కనిపిస్తుంది. రాత్రయితే గాఢాంధకారం నెలకొంటుంది. వాహనాల వెలుగుల్లో తప్ప రహదారి కనిపించే అవకాశం లేదు. ఈ కారణంగా.. చాలా ప్రమాదాలు జరుగుతున్నా హైవే అధికారులు పట్టించుకోవడం లేదు. దాచేపల్లి నుంచి మాచర్ల వరకు 41 కిలోమీటర్లు ఉండగా 13 చోట్ల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసినా.. వాటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో రాత్రిళ్లు రహదారిని చిమ్మ చీకటి కమ్మేస్తుంది.


వేదపాఠశాల నిర్వాహకులు చంద్రమౌళిని సన్మానిస్తున్న అతిథులు

వేదాలే సనాతన ధర్మానికి మార్గదర్శకాలు

అమరావతి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): వేద విద్య ఉన్నంతకాలం భారతదేశం సుభిక్షంగా ఉంటుందని.. వేదాలే సనాతన ధర్మానికి మార్గదర్శకాలు అని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ యశస్వీ రమణ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక శిశుమందిరం పాఠశాల ప్రాంగణంలో జరిగిన వేదసభ కార్యక్రమంలో యశస్వీ రమణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శ్రీ గీతా వెంకటేశ్వర వేద పాఠశాల విద్యార్థులను సన్మానించిన అనంతరం పలువురు ప్రసంగించారు. కార్యక్రమంలో వేద పాఠశాల నిర్వాహకులు ఘంటసాల చంద్రమౌళి, మణికంఠ, కశ్యపు శర్మలను అతిథులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వనమా పూర్ణచంద్రరావు, వావిలాల సుబ్బారావు, కన్నా భాస్కర్, వారణాసి వెంకటేశ్వర శర్మ, ఎస్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి పల్లకిసేవ


అమ్మవారికి పల్లకి సేవలో భక్తులు

దుర్గి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పుల శివారులో వేంచేసియున్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయంలో ఆదివారం అమ్మవారి పల్లకి సేవను మేళతాళాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషు నాయుడు, ఆలయ ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

వైభవంగా గంగమ్మ తల్లి వార్షికోత్సవం

దుర్గిలో వేంచేసిఉన్న గంగమ్మతల్లి 10వ వార్షికోత్సవం ఆదివారం భక్తులు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులు తీర్చుకున్నారు. సాయంత్రం గంగమ్మతల్లిని పురవీధుల్లో ఊరేగించారు.

లక్కరాజుగార్లపాడులో కార్డెన్ సెర్చ్


గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ హనుమంతురావు

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కరాజుగార్లపాడులో సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుహంతరావు ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పోలీసులు బృందాలుగా విడిపోయి గ్రామంలోని ప్రతి వీధిలో తిరిగి అనుమానిత గృహాలు, ప్రదేశాలు, వరిగడ్డి వాములు, పశువుల కొట్టాలు, పాడుబడిన గృహాలలో తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో అనుమానిత వ్యక్తులను ప్రశ్నించారు. బయటనుంచి గ్రామాలలోకి వస్తున్న వ్యక్తులను ఆపి వారి వివరాలు సేకరించారు. తనిఖీలలో భాగంగా సరైన పత్రా లు లేని 35 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. 3 గొడ్డ ళ్లు, ఒక బరిశెను కూడా స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. అనంతరం గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. ఎవరైనా ఘర్షణలకు దిగినా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్డెన్ సెర్చ్‌లో సత్తెనపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటికి తాళం వేస్తే.. రాత్రికి దొంగతనం

అమరావతి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి) ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నెలవైన అమరావతిలో గడచిన వారంలో మూడు దొంగతనాలు జరగడంతో గ్రామస్థులు బెంబేలెత్తిపోతున్నారు. తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగలు విజృంభిస్తున్నారు. మూడు రోజుల క్రితం ప్రభుత్వ వైద్యశాల రోడ్డులోని రెండు ఇళ్లలో తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడ్డారు. తాజాగా శనివారం రాత్రి హైస్కూల్ సమీపంలోని బందా వెంకటరామకృష్ణ ఇంటిలో దొంగతనం జరిగింది. బెంగళూరులోని పిల్లల వద్దకు ఆయన వెళ్లగా.. ఇదే అదనుగా దొంగలు తమ చేతికి పనిచెప్పారు. ఇంటి తాళాలు పగలగొట్టి..బీరువాలోని వెండి వస్తువులు అపహరించుకుపోయారు. ఉదయం పక్కంటి వాళ్లు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ అమీర్ ఇంటిని పరిశీలించారు. పగలు బజారుల్లో వెంట్రుకలు కొంటామని, దుప్పట్లు అమ్ముతామని తిరుగుతూ..రెక్కీ నిర్వహించి దొంగతనాలకు పాల్పడుతున్నారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాత్రిళ్లు 3-4గంటల సమయంలో ఈ దొంగతనాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. జరిగిన దొంగతనాలు ఒకే మాదిరిగా ఉన్నాయి. రాత్రిళ్లు పోలీసు సిబ్బంది నిర్దేశించిన సెంటర్లకు వెళ్లి.. లోకేషన్ షేర్ చేయడం తప్ప అనుమానస్పదంగా తిరుగుతున్న వారిని అదుపులోకి తీసుకుని విచారించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా గ్రామంలో నంబరు ప్లేట్ లేని వాహనాలు తిరుగుతున్నప్పటికి..వాటిపై పోలీసులు దృష్టి సారించడం లేదని అంటున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ.. దొంగల కదలికలు వాటికి చిక్కడం లేదు. అర్ధరాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని అదుపులోకి తీసుకుని విచారించాలని ప్రజలు కోరుతున్నారు.

వరికపూడిశెల ప్రాజెక్ట్ పనులు ప్రారంభించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి విజయకుమార్


సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్

మాచర్లటౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పల్నాటి ప్రజలు చిరకాల కోరిక అయిన వరికపూడిశెల ఎత్తిపోతల పథకానికి వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పల్నాడు ప్రాంతంలో తీవ్ర కరువు పీడిత ప్రాంతాలైన ఐదు మండలాలు తాగు, సాగునీటి సమస్యకు వరికపూడిశెల ఎత్తిపోతల పథకం ఒక్కటే పరిష్కారం అన్నారు. ముగ్గురు ముఖ్యమంత్రులు ఈ పథకానికి శంకుస్థాపన చేసినా పనులు మాత్రం ప్రారంభం కాలేదన్నారు. గత ప్రభుత్వంలో అటవీశాఖ అనుమతులు వస్తే ఆ శాఖకు చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకుండానే పనులు ప్రారంభిస్తున్నట్లు శిలాఫలకం వేశారన్నారు. విద్యాపరంగా వెనుకబడిన మాచర్ల ప్రాంతంలో ప్రాథమిక స్థాయి నుంచి పాఠశాల స్థాయి వరకు ఉపాధ్యాయుల కొరత నెలకొందని, సమస్యను పరిష్కరించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెనుకబడిన మాచర్ల ప్రాంతంలో అభివృద్ధికి నిధులు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా నేత ఆంజనేయులు, బండ్ల మహేష్, వై సురేష్, వెంకటరత్నం, వేముల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఆట స్థలాన్ని బాగు చేయించాలి..


నకరికల్లు కస్తూర్బా పాఠశాలలో ఆటస్థలం

నకరికల్లు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నకరికల్లు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఉన్న ఆట స్థలాన్ని బాగు చేయించాలని బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమని, పాఠశాలలో ఆట స్థలం ఉన్నా సక్రమంగా లేనందున ఆటలకు అవసరమైన శిక్షణను పొందలేక పోతున్నారన్నారు. ఎలాంటి పోటీల్లో బాలికలు పాల్గొనే అవకాశం లేకపోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆట స్థలాన్ని బాగు చేయించి క్రీడల్లో శిక్షణ ఇచ్చేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాత కక్షల నేపథ్యంలో యువకుడిపై దాడి

మాచర్లటౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామ శివారులోని వాటర్ ట్యాంకు వద్ద పాత కక్షల నేపథ్యంలో యువకుడిపై బండరాళ్లతో దాడి చేసి గాయపరిచిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఉప్పుతోళ్ల నాగరాజు మొక్కుబడి నిమిత్తం కృష్ణానది సమీపాన ఉన్న పాటిమీద మైసమ్మ ఆలయానికి వెళ్లాడు. మొక్కుబడి తీర్చుకొని వస్తుండగా గుండ్లపాడు గ్రామ శివారులోని వాటర్ ట్యాంకు వద్ద మధు, సైదారావు, ప్రసాద్ అనే ముగ్గురు వ్యక్తులు అడ్డుకొని ద్విచక్ర వాహనంపై ఉన్న నాగరాజును లాగి కిందపడేశారు. అనంతరం బండరాళ్లతో కాళ్లపై మోదడంతో రెండు కాళ్లు విరిగిపోయాయి. అదే సమయంలో వెనుకగా వస్తున్న బంధువులు నాగరాజును మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి అట్యాపాట్యా జూనియర్స్‌చాంపియన్‌షిప్‌లో పల్నాడు జిల్లా బాలబాలికలు ప్రథమ స్థానం


కోచ్‌లను సన్మానిస్తున్న సీఈవో రంగా ప్రసాదు, కార్యదర్శి శ్రీచరణ్

నకరికల్లు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఆట్యా పాట్యా జూనియర్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పల్నాడు బాలబాలికల జట్లు ప్రథమ స్థానంలో నిలిచినట్టు జిల్లా సెక్రటరీ ఉన్న రోహిత్ జోయల్ ఆదివారం తెలిపారు. శని, ఆదివారం ఒంగోలు ఏబీఎం కళాశాల గ్రౌండ్‌లో ఈ చాంపియన్‌షిప్ ఎంపిక పోటీలు నిర్వహించారు. నకరికల్లు వంగా వెంకటరెడ్డి జడ్పీహైస్కూల్లో వీరికి సత్కారసభ జరిగింది. బాలబాలికల కోచ్‌లుగా ఫిజికల్ డైరెక్టర్‌లు చింతా పుల్లయ్య, జీ ఝాన్సీరాణి వ్యవహరించారు. మేనేజర్‌గా టీ తిరుపతి రావు వ్యవహరించగా రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ పోటీ ల్లో ప్రథమస్థానంలో నిలిచిన వీరిని ఏపీ ఆట్యాపాట్యా సీఈవో రంభ ప్రసాదు, కార్యద ర్శి శ్రీ చరణ్, ప్రెసిడెంట్ జాబేజ్, పల్నాడు ప్రె సిడెంట్ చింతా సామ్రాజ్యం అభినందించారు.


ఆర్థికసాయం అందిస్తున్న సురేష్ యాదవ్

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కారంపూడి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కూలి పనులు చేసుకునే నిరుపేద కుటుంబానికి చెందిన ఏడాది వయసున్న బాలుడు అభిషేక్‌పాల్ గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. వైద్యులు ఆపరేషన్ చేయాలని తెలపడంతో ఆర్థికస్తోమత లేని ఆ కుటుంబం టీడీపీ మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్‌ను సంప్రదించారు. ఈ మేరకు సూపర్‌స్టార్ మహేష్‌బాబు అభిమాన సంఘంతో మాట్లాడి ఆ బాలుడికి విజయవాడలోని ఆంధ్రా హాస్పిటల్‌లో ఉచిత ఆపరేషన్ చేసేలా చూడడంతో పాటు అభిమాన సంఘం తరపున రూ.15వేలను ఆదివారం బాలుడి కుటుంబసభ్యులకు అందించారు.

క్రోసూరు చెరువుకు నీటి విడుదల

● తూముల ద్వారా పంట పొలాలకు తరలింపు


తూముల ద్వారా పంట పొలాలకు మళ్ళిస్తున్న నీరు

ఎఫెక్ట్


క్రోసూరు చెరువుకు చేరుతున్న నీరు

క్రోసూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): క్రోసూరు చెరువుకు యుద్ధ ప్రాతిపదికపై నీటిని విడుదల చేశారు. ఆదివారం ఉదయం నుంచి చెరువుకు ఎన్ఎస్‌పీ కాలువల ద్వారా, క్రోసూరు ఫీడర్ ద్వారా నీరు వచ్చి చేరుతుంది. ఈ నీటిని చెరువు తూముల ద్వారా పంటపొలాలకు తక్షణమే మళ్లిస్తున్నారు. మాగాణి సాగు ప్రశ్నార్థకం... ఎండిపోయిన క్రోసూరు చెరువు శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు అధికారులు తక్షణమే స్పందించి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం చెరువునకు సంగం వరకు నీరుచేరింది. చెరువును పూర్తిగా నీటితో నింపుతామని అధికారులు తెలిపారు. చెరువు కింద క్రోసూరు, ఎర్రబాలెం గ్రామాలకు చెందిన సుమారు ఆరు వందల ఎకరాల మాగాణి సాగవుతోంది. పంట పొలాలకు నీటిని వదులుతున్నామని, అధికారులు తెలిపారు. క్రోసూరు, ఎర్రబాలెం గ్రామ రైతులు ఎమ్మెల్యే ప్రవీణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గుంతలమయంగా చాగల్లు-తొండపి రహదారి

నకరికల్లు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): చాగల్లు నుంచి తొండపి వెళ్ళే రహదారి గుంతలమయంగా మారింది. నియోజకవర్గ కేంద్రమైన సత్తెనపల్లి వెళ్ళటానికి ఈ మార్గం దగ్గరగా ఉంది. చాగల్లు, కండ్లకుంట, చీమలమర్రి, చల్లగుండ్ల గ్రామాల ప్రజలు ఈ మార్గం ద్వారా సత్తెనపల్లికి వెళుతుంటారు. నియోజకవర్గానికి వెళ్ళే మార్గంలో ఉన్న ఈ రహదారి గుంతలుమయంగా మారటంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ ప్రాంత ప్రజలు సత్తెనపల్లితో పాటు గుంటూరుకు ఈ మార్గానే వెళ్తుంటారు. ఈ రహదారిని ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


గుంతలమయంగా మారిన చాగల్లు - తొండపి రహదారి

అమ్మవార్లకు బోనాల సమర్పణ

కారంపూడి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపల్లిలో వేంచేసియున్న శ్రీపాతపాటేశ్వరి అమ్మవారికి ఆదివారం భక్తులు బోనాలు సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ముందుగా చింతపల్లి సీతారామాంజినేయులు, పంగులూరి వెంకటేశ్వర్లు, ఉన్నం శ్రీనివాసులు సతీసమేతంగా అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యాన భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉన్న శివయ్య, రామారావు, మధు, రాచకొండ నరసింహారావు, గమిడి పిచ్చియ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ బోనాల వేడుకలు

బెల్లంకొండ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బెల్లంకొండలో ఆదివారం ముత్యాలమ్మ బోనాల వేడుకలను వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన బుడగ జంగాలు సుమారు 500మంది ఆదివారం ఉదయం ముత్యాలమ్మ ఆలయంలో బోనాలు సమర్పించారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్న బుడగ జంగాలు బెల్లంకొండ వచ్చి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణ చేశారు. కార్యక్రమంలో బుడగ జంగాల నాయకులు, ఊరా వీరమల్లు, సాంబయ్య, నారాయణ, శ్రీరాములు, బుడగజంగాల పెద్దలు పాల్గొన్నారు.

● బెల్లంకొండ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ యాదవ బజారులో ఉన్న గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ గంగమ్మ పోలేరమ్మ, అంకమ్మ తల్లులకు గ్రామస్తులు బోనాలు సమర్పించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే మస్తాన్‌షరీఫ్, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, గ్రామ పెద్దలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● పెదకూరపాడు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 75 తాళ్ళూరు శాంతి కాలనీలోని ముత్యాలమ్మ తల్లికి భక్తి శ్రద్ధలతో బోనాలను సమర్పించారు. ప్రతి ఏడాది బుడగ జంగాల కాలనీ వాసులు వివిధ ప్రాంతాల్లో ఉన్నా గ్రామానికి చేరుకొని ప్రతి ఇంటి నుంచి పొంగళ్ళ బోనాలను తీసుకు వెళ్ళి ముత్యాలమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో సమర్పిస్తారు. బుడగ జంగాల పెద్దలు కిన్నెర అచ్చయ్య నేతృత్వంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ముత్యాలమ్మ తల్లి దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలను, పసుపు, కుంకుమ, గాజులను సమర్పించారు.

● రెంటచింతల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): శ్రావణ ఆదివారాన్ని పురస్కరించుకుని రెంటచింతల గ్రామ దేవతైన ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


రెంటచింతల: ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు


కారంపూడి: ప్రత్యేక అలంకరణలో శ్రీపాతపాటేశ్వరి అమ్మవారు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

రేపు మద్దిరాలలో మెగా జాబ్ మేళా

చిలకలూరిపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉదయం 9గంటలనుంచి చిలకలూరిపేట కోటప్పకొండ రోడ్డులో మద్దిరాల సాదినేని చౌదరయ్య కళాశాలలో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రెసిడెంట్, సాదినేని హనుమంతరావు, డైరెక్టర్ పువ్వాడ శివప్రసాద్ ఆదివారం తెలిపారు. జాబ్‌మేళాలో సుమారు 22 కంపెనీలు పాల్గొంటున్నాయని చెప్పారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ వరకు చదువుకున్న 18-40 ఏళ్ల వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు, బయోడేటా, సర్టిఫికెట్లు, జిరాక్స్, ఆధార్ నకలు, పాస్ పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

ఆర్‌యూబీలోకి మురుగు నీరు

- గోడల నుంచి లీకవుతున్న మురుగు
- ప్రమాదకరంగా రెయిలింగ్
- నిర్వహణను మరచిన అధికారులు
- పురపాలకుల మొద్దు నిద్ర



ఆర్‌యూబీలోకి లీకు అవుతున్న మురుగునీరు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట ప్రకాష్‌నగర్ ఆర్‌యూబీ నిర్వహణను మునిసిపాల్టీ గాలికివదిలేసింది. ఇక్కడి సమస్యలు పరిష్కరించడంలో పురపాలకులు మొద్దు నిద్ర వీడటంలేదు. నిత్యం ఆర్‌యూబీలో నుంచి వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీనిలోకి మురుగునీరు ప్రవేశిస్తోంది. వహనాదారులపై మురుగునీరు చిందిపడుతుండటంతో వారి దుస్తులు పాడైపోతున్నాయి. బ్రిడ్జి పైభాగంలో మురుగు కాలువ ఉంది.



ఆర్‌యూబీ పై భాగంలో నిలిచిపోయిన మురుగునీరు

ఇది పూడిపోయి నీరు బ్రిడ్జిలోపలకి లీకవుతున్నది. కొంత కాలంగా ఈ పరిస్థితి నెలకొన్నా పూడిపోయిన మురుగు కాలువను పునరుద్ధరించి మురుగు నీరు లీకేజీని నివారించడంలో మునిసిపల్ అధికారులు విఫలమయ్యారు. ఈ సమస్య రోజు రోజుకు జఠిలమవుతోంది. ఆర్‌యూబీ ఎగువను ఉన్న ఆర్‌అండ్‌బీ కార్యాలయంలోకి కూడా మురుగునీరు ప్రవేశించింది. సదరు అధికారులు మునిసిపాల్టీలో పిర్యాదు చేసినా సమస్య పరిష్కరించడంలేదని సదరు సబ్బంది తెలిపారు. ఇలానే మురుగు నీరు లీకైతే ఆర్‌యూబీకి నష్టవాటిల్లుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరో వైపు ఆర్‌యూబీలో ఫుట్‌పాత్‌కు ఏర్పాటుచేసిన రెయిలింగ్ ఊడిపోయింది. ఇది వాహనదారులకు తగిలేలా ప్రమాదకరంగా మారింది. దీనిని పునరుద్ధరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బ్రిడ్జి ప్రాంతంలో ఒకోరోజు లైట్లు కూడా వెలగడంలేదు. దీంతో సైకిళ్లపై వెళ్లే వారు ఇక్కట్లు పడుతున్నారు. ఆర్‌యూబీలో అపరిశుభ్రత తాండవిస్తోంది. మురుగునీరు లీకేజిని అరికట్టేందుకు మునిసిపాల్టీ అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

టిడ్కో హౌసింగ్ కాలనీ పరిసరాల్లో

పశువుల కళేబరాలను తొలగించాలి

- ప్రజా సంఘాల నాయకుల డిమాండ్



నరసరావు పేట టిడ్కో హౌసింగ్ కాలని వద్ద చనిపోయిన పశువుల కళేబరాలను చూపిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నరసరావుపేట రూరల్, ఆగష్టు 10 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణ శివారు కాలనీలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మించిన టిడ్కో హౌసింగ్ కాలనీ వద్ద చనిపోయిన పశువుల కళేబరాలను తీసుకు వచ్చి నిల్వ చేస్తున్నారని తద్వారా ఆయా పరిసర ప్రాంతాల్లో నివాసముండే వారు ఆయా వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, వై.వెంకటేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి తదితరులు కాలనీ పరిసరాల్లో ఉన్న ఎముకల కళేబరాలను పరిసరాల్లో ఉన్న మురికి నీటిని పరిశీలించారు. స్థానికులు 10ఏళ్ల క్రితం డబ్బులు చెల్లిస్తే ఇక్కడ ఇళ్లు ఇచ్చారని మౌలిక సదుపాయాలైన నీటి సమస్య సరిగా లేదని, పారిశుధ్యం లేదని, మెయిన్ రోడ్ నుంచి కాలనీకి వచ్చే దారిలో లైటింగ్ లేదని, చుట్టుపక్కల పశువుల కళేబారాలను, వ్యర్థ పదార్థాలను మటన్ వ్యాపారులు పెద్దఎత్తున ఇక్కడ నిల్వ చేస్తున్నారని వాపోయారు. అంతేకాకుండా కొన్ని కళేబరాలను కాలువల్లో వేస్తున్నారని ఆ నీటితోనే పలువురు రైతులు వ్యవసాయం చేయాల్సి ఉందన్నారు. దీనిపై గతంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని, రెండు రోజులు వేయకుండా ఆపివేశారు కాని తిరిగి కళేబరాలను నిల్వ చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు రక్షణ కల్పించాలని, పారిశుధ్య చర్యలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడియం నాయకులు నల్లపాటి రామారావు, వై వెంకటేశ్వరరావు, ఎంఎస్యు నాయకులు షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి ఇద్దరి సస్పెన్షన్

చిలకలూరిపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నియోజకవర్గానికి చెందిన ఇద్దరు వైసీపీ నాయకులను పార్టీ నుంచి ఆదివారం సస్పెండ్ చేశారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. సస్పెండ్ అయిన వారిలో చిలకలూరిపేట మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బొల్లెద్దు చిన్న (గడ్డం చిన్న), చిలకలూరిపేట మండలం పోతవరం గ్రామ సర్పంచ్ షేక్ అబ్దుల్ బాషా ఉన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చి న నేపథ్యంలో క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు పార్టీ అధ్యక్షుడు ఈ మేరకు నిర్ణ యం తీసుకున్నారు.

చిలకలూరిపేటలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

చిలకలూరిపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సీపీఐ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గిరిజనులకు సాగు చేసుకునేందుకు వ్యవసాయ భూమిని ఇవ్వడానికి నిరాకరిస్తున్న ప్రభుత్వం కంపెనీలకు వేల ఎకరాలు ధారాదత్తం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన సంఘాల అధ్యక్షులు బి శ్రీనునాయక్, కౌన్సిలర్ వి.కోటానాయక్, సుగాలి వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బి శ్రీనునాయక్, బీసీ సంఘాల నాయకులు కొండ్రముట్ల నాగేశ్వరరావు, పుట్టా వెంకట బుల్లోడు, దళిత సంఘాల నాయకులు నీలం యేసు రాజులు మాట్లాడుతూ 1993 ఆగస్టు 9వ తేదీన ఐక్యరాజ్యసమితి గిరిజన ప్రజల స్థితిగతులపై అధ్యయనం చేసి ఏడు అంశాలపై తీర్మానంచేసి అమలు చేయమని చెబితే ఆ దిశగా ప్రభుత్వాలు చేయడం లేదని, గిరిజనులకు కార్పొరేషన్ రుణాలు ఇవ్వడంలో విఫలమయ్యాయని, ఎస్టీల రిజర్వేషన్‌లను హరించేలా కేంద్రంలో పెద్ద కుట్ర జరుగుతుందన్నారు.

కృష్ణమాదిగ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి: ఎంఈఎఫ్

వినుకొండ టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాప్టిస్ట్ చర్చి ఆవరణలో ఎంఈఎఫ్ నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు గరికపాటి హిట్లర్ మాదిగ పాల్గొని మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన నరసరావుపేటకు కృష్ణమాదిగ రానున్నారని, ఈ కార్యక్రమాన్ని మాదిగ ఉద్యోగులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే జాంభవ భవన నిర్మాణంలో మాదిగ ఉద్యోగులు విరాళాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఎంఈఎఫ్ సభ్యత్వం నమోదు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మాదిగలకు కూటమి ప్రభుత్వంలోనే సామాజిక న్యాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చందోలు నాగవాణి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.బుజ్జి, బాప్టిస్ట్ చర్చి సెక్రటరీ జి.ఆశీవరప్రసాద్, నవీన్, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

క్యాంపునకు ఎన్ఈసీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ ఎంపిక

నరసరావుపేట రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్స్ ఆగస్టు 11 నుంచి 20వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో జరగనున్న ఆర్మీ అటాచ్‌మెంటు క్యాంపులో పాల్గొనేందుకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీల్, డాక్టర్ తిరుమలరావు, వీఎస్ఎస్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకును ప్రారంభించిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

చిలకలూరిపేట, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై కొత్త మార్కెట్ యార్డు పక్కన గణపవరం చిలకలూరిపేట మధ్య కొత్తగా నిర్మించిన బీపీసీఎల్ పెట్రోల్ బంకును నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆదివారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, పెట్రోల్ బంకు నిర్వాహకులు మక్కెన వంశీకృష్ణ, ధూళిపాళ్ల వెంకటరావు, గౌరీ శంకర్ టెంట్ హౌస్ అధినేతలు, బీపీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

వెటర్నరీ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీగా వేమారెడ్డి ఎంపిక

రొంపిచర్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విప్పర్లరెడ్డిపాలెంకు చెందిన దుద్దుకుంట వేమారెడ్డి రాష్ట్ర వెటర్నరీ అసిస్టెంట్ అసోసియేషన్ సెక్రటరీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్థులు అభినందించారు.

ఘనంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ జన్మదినం

చిలకలూరిపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ జన్మదిన వేడుకలను నరసరావుపేట సెంటర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కె.పవన్‌కుమార్‌గాంధీ, ఎస్.పోలయ్య, ఎం.శివనాగేశ్వరరావు, జి.హేమకుమార్, పి.పూర్ణచంద్రరావు, టి.జయరామరెడ్డి పాల్గొన్నారు.

ఎరువులు,పురుగు మందుల షాపుల్లో తనిఖీలు

ఈపూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువులు, పురుగు మందుల షాపులను మండల వ్యవసాయాధికారి ఆర్.రామారావు ఆదివారం తనిఖీ చేశారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన బయో మాయ కథనానికి స్పందించిన వ్యవసాయశాఖాధికారులు ఎరువులు, పురుగు మందుల షాపులలో తనిఖీ నిర్వహించారు. ప్రతిషాపులో మందు డబ్బాలు, రికార్డులు పరిశీలించారు. బయో మందులు విక్రయించిన, అధిక ధరలకు విక్రయించిన లైసెన్స్ రద్దు చేయడంతో పాటు చర్యలు తీసుకుంటామన్నారు.

326మందికి వైద్య పరీక్షలు



కారుమంచిలో వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ లక్ష్మి

కారుమంచి (శావల్యాపురం) ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటకు చెందిన జయతి హాస్పిటల్ ఆధ్వర్యంలో మండలంలోని కారుమంచిలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ డాక్టర్ కందుల లక్ష్మీ, హాస్పిటల్ సిబ్బంది పాల్గొని షుగర్, బీపీ, క్యాన్సర్, గ్యాస్ట్రబుల్, గుండె సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కారుమంచి, చుట్టుపక్కల గ్రామాల నుంచి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న 326మంది రోగులు వైద్య శిబిరానికి హాజరై వైద్యపరీక్షలు చేయించుకున్నారు. రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు కూడా పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఆర్ఎంపీలు మహమ్మద్, రామారావు, తిరుమలరావు వైద్యశిబిరానికి తమవంతు సహకారమందించారు. టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు యరమాసు కోటేశ్వరరావు, ఎంపీటీసీ యూనిట్ ఇన్‌చార్జి కోటా హరిబాబు, టీడీపీ నాయకులు వైద్యశిబిరాన్ని పర్యవేక్షించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవానికి అంత్యక్రియలు చేస్తున్న మానవసేవా సమితి సభ్యులు

వినుకొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మానవ సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మానవ సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గుర్తుతెలియని వృద్ధుడు రెండు రోజుల క్రితం మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న వినుకొండ పోలీసులు మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి మార్చురీలో ఉంచి అతని ఆచూకీ కోసం ప్రయత్నించారు. మృతునికి సంబంధించిన ఆచూకీ పోలీసులకు లభించలేదన్నారు. దీంతో సమాచారం తెలుసుకున్న మానవసేవా సమితి సభ్యులు అనాథ శవానికి అంత్యక్రియలు చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పి.వి.సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి చామర్తి భవాని శంకర్, సభ్యులు అంజి, మస్తాన్‌వలి, జాబీర్, సర్కార్ తదితరులు పాల్గొన్నారు.

బొప్పూడిలో ఐదుగురు జూదరుల అరెస్టు... రూ.34 వేలు స్వాధీనం

చిలకలూరిపేట, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొప్పూడి పొలాల్లో పేకాట (కోత ముక్క) ఆడుతున్న ఐదుగురుని చిలకలూరిపేట రూరల్ పోలీస్ ఎస్ఐ జి.అనిల్ కుమార్ ఆదివారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.34,400లు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి కేసు నమోదైంది.

మంటలు రేగి కారు దగ్ధం

చిలకలూరిపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఫైర్‌స్టేషన్ రోడ్డులో ఆదివారం రాత్రి ఒక కారులో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. కారు నరసరావుపేట సెంటర్ వైపునకు వస్తుండగా డ్రైవర్ కారును పక్కన ఆపిన సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో కారులో ప్రయాణం చేస్తున్న ముగ్గురు వ్యక్తులు కారు దిగి పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రాణహాని జరగలేదు. కారు మాత్రం పూర్తిగా కాలిపోయింది. మంటలకు కారణాలు తెలియరాలేదు.

కనమర్లపూడిలో రక్తదాన శిబిరం

కనమర్లపూడి (శావల్యాపురం) ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని కనమర్లపూడి ప్రాథమిక పాఠశాల్లో బూత్ కన్వీనర్ ముక్కపాటి నాగేశ్వరరావు సహకారంతో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో 15మంది శిబిరానికి హాజరై రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ వైస్‌చైర్మన్ బెల్లంకొండ ప్రసాద్ మాట్లాడుతూ నరసరావుపేటలోని లింగంగుంట్ల ప్రభుత్వ వైద్యశాల బ్లడ్ బ్యాంక్‌లో రక్తం నిల్వలు తక్కువగా ఉన్నందున రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. రక్తదానంచేసిన 15మందిని రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. వినుకొండ గుంటి ఆంజనేయస్వామి దేవాలయం చైర్మన్ సి.కోటేశ్వరరావు, సొసైటీ సభ్యులు పి.రాము, ఎ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శ్రీదత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో

హై రిజల్యూషన్ సీటీ స్కాన్ ప్రారంభం



అత్యాధునిక సిటీ స్కాన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని వైద్య రంగంలో మరో అధునాతన అధ్యాయాన్ని జోడిస్తూ, నరసరావుపేటలోని శ్రీదత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అత్యాధునిక హైరెజల్యూషన్ సీటీ స్కాన్ సౌకర్యాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని, ఈ అధునాతన సీటీ స్కాన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ పల్నాటి జిల్లా వైద్య రంగంలో ఈ సరికొత్త సాంకేతికత ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. శ్రీదత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఈ అత్యాధునిక సాంకేతికతను ప్రవేశపెట్టడం ద్వారా స్థానికులకు అత్యుత్తమ వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చిందని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. కార్యక్రమంలో శ్రీదత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణకాంత్, టీడీపీ నాయకులు కపిలవాయి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులు, ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

ముగిసిన వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

వినుకొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి 39వ వార్షిక బ్రహ్మోత్సవాలు చివరిరోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎస్.శ్రవణ్‌కుమార్, సీహెచ్.పవన్‌కుమార్‌ల ఆధ్వర్యంలో నిత్య హోమం, చూర్ణోత్సవం, చక్రస్నానం, మహా పూర్ణాహుతి, ధ్వజ అవరోహణ, పవళింపు సేవ, మంత్రపుష్పం, నీరాజనం పూజలు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గరుడ ప్రసాదం పంపిణీ అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రెడ్డి బంగారయ్య, ప్రధాన కార్యదర్శి అచ్యుత కృష్ణసుబ్బారావు, కోశాధికారి కాళ్ల రామకోటేశ్వరరావు, మేనేజర్ వాసు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో అధ్వానంగా పారిశుధ్యం

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని పారిశుధ్యం మెరుగుపరచేందుకు చర్యలు తీసుకోవడంలేదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమంలో బాగంగా ఆదివారం పట్టణంలోని 17వ వార్డు, వరకట్ట సెంటర్లో న్యూ ఆంధ్ర స్కూల్ వెనక వైపు ఆయన పర్యటించారు. అక్కడ పారిశుధ్యం చాలా దారుణంగా ఉందని, గత 15 రోజులుగా ఇక్కడ మున్సిపల్ అధికారులు చెత్తతీయడం లేదని, రోడ్లు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయన్నారు. తక్షణమే పట్టణంలోని అన్ని వీధులలో చెత్తను తొలగించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. అనంతరం సత్తెనపల్లి రోడ్డులోని డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంను సందర్శించి అక్కడ తాగిపడేసిన మద్యం సీసాలను పడిఉండటాన్ని గమనించారు. మహిళలు సాయంత్రం పూట స్టేడియం వైపు రావడానికి భయపడుతున్నారని, రాత్రిపూట స్టేడియంలో ఎక్కడ లైట్లు వెలగడం లేదని, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా తయారైందని ఆరోపించారు. తక్షణమే స్టేడియంలో లైట్లు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా ఒక వాచ్‌మెన్‌ను నియమించి అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టాలని డియాండ్ చేశారు.

పోలేరమ్మకు పూజలు

నూజెండ్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం మండలంలోని ముక్కెళ్ళపాడులో గ్రామ దేవత పోలేరమ్మకు మహిళలు, పొంగళ్లు సమర్పించారు. పురోహితులు విశ్వనాథ శాస్త్రి ఆధ్వర్యంలో విశేషంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

బుచ్చిపాపన్నపాలెంలో ...

రొంపిచర్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చిపాపన్నపాలెంలో ఆదివారం పోలేరమ్మ తల్లి కొలుపులు వైభవంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామస్థులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో అన్నెం పున్నారెడ్డి, పడాల చక్రారెడ్డి, మోతుకూరి వెంకటేష్, పోతులూరి సుబ్బారెడ్డి, పొనుగోటి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

మసీదు షాపింగ్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన



షాపింగ్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వరకట్టలో జామియా మసీదు పరిసరాలలో నిర్మితమయ్యే షాపింగ్ కాంప్లెక్స్‌కు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం నరసరావుపేట పట్టణంలో వాణిజ్య కార్యకలాపాలకు కొత్త ఊపిరి పోస్తుందన్నారు. ఇది స్థానిక వ్యాపారులకు, ఉపాధి అవకాశాల సృష్టికి దోహదపడుతుందన్నారు. ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ జామియా మసీదు ప్రాంగణంలో కాంప్లెక్స్ నిర్మాణం స్థానిక సమాజంలో ఐక్యతను, ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు కూడా ఈ ప్రాజెక్టు విజయవంతం కోసం తమ సహకారన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 15, 16 వార్డుల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నడికట్టు రామిరెడ్డి పాఠశాలకు ఉత్తమ పురస్కారం

నాదెండ్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుమామిళ్ళ గ్రామంలోని నడికట్టు రామిరెడ్డి ఉన్నత పాఠశాల ఉత్తమ పురస్కారానికి ఎంపికైంది. రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా ఉత్తమ పాఠశాలలకు పురస్కారం ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో పల్నాడు జిల్లాలోనే ఉన్నత పాఠశాలల్లో ఈ పాఠశాలను ఎంపిక చేయటం విశేషం. 2024 - 25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూపేందుకుగాను ప్రభుత్వం ఈ పాఠశాలను ఎంపిక చేసింది. ఈ పాఠశాలలో 66 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్ష రాయగా నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. పదిమంది విద్యార్థులు రాష్ట్రంలోని వివిధ ట్రిపుల్ ఐటీలకు ఎంపికయ్యారు. ఆగస్టు 15వ తేదీన విజయవాడలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రధానోపాధ్యాయులు మేకల కిషోర్‌కు పాఠశాల తరుపున ఈ పురస్కారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందించనున్నారు. 2007లో చిరుమామిళ్ళ గ్రామస్థుడు, గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి పాఠశాల నిర్మాణానికి స్థలం ఇవ్వటంతో సొంత నిధులు వ్యయం చేసి పాఠశాల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. కాగా పాఠశాలను ప్రభుత్వం ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేయటం పట్ల కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు డాక్టర్ సిరిపురపు అప్పారావు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలవాలి: నడికట్టు రామిరెడ్డి

ప్రభుత్వం పాఠశాలను ఉత్తమ పాఠశాలగా ప్రకటించటం సంతృప్తిని కలిగిస్తున్నదని నడికట్టు రామిరెడ్డి అన్నారు. ప్రభుత్వంతో పాటు తాను పాఠశాలతో పాటు విద్యార్థులకు మౌళిక వసతులు కల్పిస్తున్నాం. ఈ క్రమంలో జిల్లాలోనే పాఠశాలను ప్రథమ స్థానంలో నిలపగలిగాం.

వైద్య శిబిరంలో 400 మందికి పరీక్షలు

నాదెండ్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాదెండ్ల గ్రామంలోని గంగా పార్వతి సమేత మూల స్థానేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని నరసరావుపేటకు చెందిన సీనియర్ వైద్యుడు డాక్టర్ పువ్వాడ సూర్యనారాయణ ప్రారంభించారు. నాదెండ్ల గ్రామస్థుడు, నెఫ్రాలజిస్టు డాక్టర్ నల్లమోతు ప్రవీణ్, ఆయన సతీమణి న్యూరాలజిస్టు డాక్టర్ మెడబలిమి సౌమ్యలు రోగులను పరీక్షించారు. సుమారు నాలుగు వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యార్డు మాజీ చైర్మన్ నెల్లూరి సదాశివరావు, సొసైటీ అధ్యక్షుడు నల్లమోతు హరిబాబు, టీడీపీ నేతలు దేవలపల్లి భుజంగరావు, వేములపల్లి వెంకటేశ్వరరావు, రామచంద్రరరావు, పెద్దలు అనుమోలు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న మేనేజింగ్ ట్రస్టీ బొల్లు వెంకటేశ్వరరావు, ట్రస్ట్ సభ్యులు

బొల్లు రాజేశ్వరి చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం

నరసరావుపేట టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలో ఉన్న బొల్లు రాజేశ్వరి చారిటబుల్ ట్రస్ట్ ఆదివారం బొల్లు రాజేశ్వరి 81వ జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలలో భాగంగా ఆర్థికసాయం చేసింది. ఈపూరు మండలం ఇనిమెళ్ళకు చెందిన ఐఐటీ ఖరగ్‌పూర్‌లో మెటలర్జీలో సీటు సంపాదించిన ముప్పా సుప్రజ అనే పేద విద్యార్థికి రూ.20వేలు ఆర్థికసాయం అందజేసింది. కార్యక్రమంలో సినీ నటుడు, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ బొల్లు వెంకటేశ్వరరావు, ట్రస్ట్ సభ్యుడు కోమటినేని నాసరయ్య, బీ సాయినాథ్, మర్లపాటి రామకృష్ణ, బొల్లు రాజేంద్రప్రసాదు, జాస్తి గోపాలకృష్ణబాబు, బీపీఎల్ వరప్రసాదు, కనుమూరి నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.



శాంతియాత్రలో పాల్గొన్న యోగా సభ్యులు

యోగా సేవా కేంద్రం సభ్యుల శాంతి యాత్ర

నరసరావుపేట టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం 31సంవత్సరాలు పూర్తి చేసుకుందని నరసరావుపేట శాఖ నిర్వాహకులు కూనిశెట్టి వెంకట జనార్దనరావు తెలిపారు. ఆదివారం నరసరావుపేట పట్టణంలోని పట్టాభిరామస్వామి ఆలయం నుంచి శివుడు బొమ్మ కూడలి వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కూనిశెట్టి వెంకట జనార్దనరావు మాట్లాడుతూ మంగళగిరి ప్రధాన కేంద్రం ఏర్పడిన వెంకటేశ్వర సేవా కేంద్రం రాష్ట్రంలో అనేక శాఖలు ఏర్పాటుచేసి లక్షలాదిమందికి యోగాలో ఉచితంగా శిక్షణ ఇచ్చిందన్నారు. నరసరావుపేట శాఖ 24సంవత్సరాలు పూర్తి చేసుకొని వేలాది మందికి ఉచితంగా యోగాలో శిక్షణ ఇచ్చిందన్నారు. పట్టణంలోని ఆనంద వృద్ధాశ్రమంలో ఉంటున్న 10మంది వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. కూర్చోవడానికి రెండు కుర్చీలు, వృద్ధాశ్రమం తలుపులు ఏర్పాటుకు రూ.12వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో నరసరావుపేట శాఖ కన్వీనర్ కూనిశెట్టి అనురాధ, సహాయ గురువులు పొలిమేర వెంకటరెడ్డి, అడ్డగిరి రమేష్‌బాబు, మల్లేశ్వరి, అధ్యాపకుడు ఆజేయరెడ్డి, యోగ సాధకులు పాల్గొన్నారు.